VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 03.08.2026
సంపుటి : 09 సంచిక : 55 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## డ్రగ్స్ నిర్మూలిస్తేనే వికసిత్ భారత్ సాధ్యం

- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- ప్రత్యేక మాదకద్రవ్య రహిత యువత కార్యక్రమం
- దేశ యువతకు ప్రధాని మోదీ సందేశం

2

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు





- సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని సందర్శించిన సీఎం
- రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు
- శాంతి, సంక్షేమం కలగాలని అమ్మవారిని ప్రార్థించిన రేవంత్
- సీఎంతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధుల హాజరు
- బోనాల వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వం
- అమ్మవారి ఆశీర్వాదాలు పొందిన సీఎం, మంత్రివర్గ సభ్యులు
- ఆలయంలో భక్తుల రద్దీ మధ్య పూజలు

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ బోనాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న సీఎం రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి, సంక్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్కతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఆలయానికి చేరుకుని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.బోనాల వేడుకల నేపథ్యంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం భక్తులతో కిటకిటలాడుతుండగా, కట్టుదిట్టమైన భద్రత మధ్య సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఆనందం కలగాలని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రార్థించారు.

# ఉత్సవాల నిర్వహణ కోసం బిచ్చమెత్తుకోవాలా?

- రంజాన్ పండుగకు రూ.33 కోట్లు... బోనాలకు రూ.20 కోట్లా?
- జంట నగరాల్లోనే 3 వేల పైచిలుకు దేవాలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి?
- ప్రభుత్వం ఇచ్చే నిధులు ఏ మూలకు సరిపోతాయి?
- కాంగ్రెస్ కు హిందూ పండుగలంటే అంత చులకన ఎందుకు?
- ముస్లిం అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే ముస్లిం అని రేవంత్ రెడ్డి మాటలే ఇందుకు నిదర్శనం
- బీఆర్ఎస్ సైతం బోనాల ఉత్సవాలకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహించింది
- జనాభా ప్రాతిపదికన పండుగలు, ఉత్సవాలకు నిధులను కేటాయించండి
- హిందూ సమాజమంతా జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైంది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



2



# 'తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నాం'



2

- 2047 నాటికి $3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం
- పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంసాన్ని తుడిచిపెట్టి.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం
- ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగుల వేతనాలు.. రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా
- 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం 'బ్రేక్‌ఫాస్ట్'.. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- అమెరికాలో ఐఓసీ సమావేశంలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

తెలంగాణలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రూపురేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (IOC) ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులు, ఎన్ఆర్ఐలకు ఆయన వివరించారు.

### 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం.. 'భారత్ ఫ్యూచర్ సిటీ'

తెలంగాణను 2047 నాటికి $3 ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో $1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047'విజన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా నాలుగో మహానగరంగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్-జీరో (Net-Zero) ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ' ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

# కుటుంబ సమేతంగా తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయాలకు సంస్కృతి ఆచారాలకు ఆషాఢ మాస బోనాలు ఒక ప్రతిక బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రోజున శ్రీ ఉజ్జయిని అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన బంగారు బోనం పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది..అమ్మవారిని ప్రభుత్వం పక్షాన వేడుకుంటున్నాం.

▶ మిగతా 2లో

# సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు

- హైదరాబాద్‌లో కాలనీ సంక్షేమ సంఘాల భారీ ర్యాలీలు
- వరద కట్టడి, చెరువుల పరిరక్షణ చర్యలపై ప్రశంసలు
- హైడ్రాకు సంఘీభావంగా నగరంలో వీధినకెక్కిన ప్రజలు
- రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణ
- 3325 ఎకరాల కబ్జా భూములను కాపాడిన వైనం



4

## జెన్ జీ మద్దతు బీజేపీకే

- కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ ధీమా
- యువత ప్రధాని మోదీకి అండగా నిలుస్తోంది
- యువత శక్తితోనే ప్రధాని మోదీ హ్యాట్రిక్ విజయం



4

## ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తి చేయడమే లక్ష్యం: కోమటిరెడ్డి

- రెండు పంటలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి
- బ్రాహ్మణ వెల్లెం ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి నీరు అందిస్తామన్న మంత్రి



2

## గోదావరి శాంతిస్తోంది..

- రెండో ప్రమాద హెచ్చరిక ఎత్తివేత
- భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న వరద ప్రవాహం
- ఉదయం 10 గంటలకు నీటిమట్టం 46.7 అడుగులు
- 10.83 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవాహం



4

## మోదీయే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి: రాహుల్

- పరీక్షల వ్యవస్థలో అవినీతికి ప్రధానే బాధ్యత వహించాలని విమర్శ



2

# సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా కుటుంబ సమేతంగా అమ్మవారికి తొలి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఎవరి వృత్తుల్లో వారు విజయం సాధించాలని తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని ఆ అమ్మవారి కరుణ కటాక్షాలు ఉండాలని ప్రార్థిస్తున్నా..హైదరాబాద్ నగరానికి సంబంధించి బోనాల ఉత్సవాల్లో ప్రజల ఆకాంక్షలకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది.హైదరాబాద్ ప్రజలు ఆతిథ్యం ఇవ్వడంలో ముందుంటారు.బోనాల ఉత్సవాల్లో కులాలకతీతంగా మతలకతీతంగా భాగస్వామ్యమై జరుపుకుంటారు.ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సందర్భంగా భక్తుల రద్దీ కూడా పెరుగుతుంది.గతంలో ఈ ప్రాంతంలో అనేక విపత్తులు వచ్చిన అమ్మవారు ఆదుకున్నారు ప్రజలందరిపై .అమ్మవారి ఆశీర్వాదం ఉండాలి.ఇప్పుడు కూడా ఎల్ నినో విపత్తు వచ్చినా.. ఇలాంటి ఇబ్బందులు కలగ వద్దని బోనాల ఉత్సవాల సందర్భంగా అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాకు విశ్వాసం ఉంది ప్రకృతి వైపరీత్యం వచ్చినా తెలంగాణ పై అమ్మవారి ఆశీర్వాదంతో మంచి వర్షాలు కురిపించాలని అమ్మవారిని వేడుకుంటూ బోనాల సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు.

# ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తి చేయడమే లక్ష్యం: కోమటిరెడ్డి



- కంచనపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం
- గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేస్తామని హామీ
- దోమలపల్లిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- నల్గొండ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వారానికి రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం

**నల్గొండ, వెలుతురు, ఆగస్టు 2:**

ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పనులను పూర్తి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సొరంగ మార్గం పూర్తయితే రెండు పంటలకు సాగునీరు అందించి నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు.ఆదివారం నల్గొండ మండలం కంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.కంచనపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. అలాగే దోమలపల్లి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

రానున్న మూడేళ్ల పాటు నల్గొండ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారానికి రెండు రోజులు నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

# మోదీయే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి: రాహుల్



- పేపర్ లీక్‌లతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్న
- విద్యార్థులను క్షమిస్తున్నానని చెప్పడం దారుణమని వ్యాఖ్య
- తమిళనాడులో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఎక్స్‌లో పోస్ట్
- విద్యా వ్యవస్థ వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన కాంగ్రెస్ నేత
- లాఠీచార్జి బాధితులకు కూడా ప్రధాని క్షమాపణ చెప్పాలని దీప్కే డిమాండ్
- మోదీ తదుపరి వీడియోలో బాధితులను ఉద్దేశించి మాట్లాడాలని ఆశాభావం

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 2:**

దేశంలో అవినీతితో కూడిన పరీక్షల వ్యవస్థ నడుస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీయే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. తన క్షమాభిక్ష ఎవరికీ అవసరం లేదని, ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని 'క్షమించడం' గురించి మాట్లాడడం సమంజసం కాదని శనివారం ఎక్స్ వేదికగా విమర్శించారు.పేపర్ లీక్‌ల వల్ల ఆత్మహత్య చేసుకున్న ప్రతి విద్యార్థి వెనుక ఓ కుటుంబం తీవ్ర విషాదంలో ఉందని రాహుల్ పేర్కొన్నారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధను ఏదీ భర్తీ చేయలేదని, విఫలమైన విద్యా వ్యవస్థపై వారికి ఎన్నో ప్రశ్నలు మిగిలిపోయాయని అన్నారు. తమిళనాడులో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'ప్రశ్నపత్రాల లీక్‌లు, పరీక్షల రద్దు, సంవత్సరాల కష్టం ఒక్క రాత్రిలో వృథా కావడం, నిజాయతీ లేని వ్యవస్థలో విద్యార్థులు మాత్రమే నిజాయతీగా ఉండాలని చెప్పడం, చివరకు వారినే క్షమిస్తున్నానని ప్రధాని మాట్లాడడం బాధాకరం' అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. చలో పార్లమెంటు ఆందోళన సందర్భంగా పోలీసుల లాఠీచార్జిలో గాయపడిన మహిళా నిరసనకారులకు ప్రధాని తన తదుపరి వీడియో సందేశంలో క్షమాపణ చెబుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం విడుదల చేసిన వీడియోలో తనను దూషించిన వారిని క్షమిస్తున్నానని ప్రధాని పేర్కొన్న నేపథ్యంలో స్పందించిన దీప్కే.. జులై 20న జరిగిన లాఠీచార్జిలో గాయపడిన వారికి కూడా క్షమాపణ చెప్పాలని ప్రధాని ముందుకు రావాలని కోరారు.

# 'తెలంగాణను ప్రపంచ స్థాయికి...

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాన్ని కోర్ అర్బన్ (CURE), పెరి-అర్బన్ (PURE), రూరల్ అగ్రి (RARE) అని మూడు ఆర్థిక మండలాలుగా వర్గీకరించి వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

**'యంగ్ ఇండియా'తో విద్యా రంగంలో విప్లవం**

యువతను అంతర్జాతీయ స్థాయి నిపుణులుగా మార్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని వెల్లడించారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నెలకొల్పామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు.టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ. 2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను (ITIs) హైటెక్ డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే మోడల్‌గా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించామన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహార 'బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం 'మధ్యాహ్న భోజన' సౌకర్యాన్ని విస్తరించామన్నారు.

**ఆక్రమణలపై 'హైడ్రా' ఉక్కుపాదం.. మూసీకి పూర్వవైభవం**

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు 'హైడ్రా' (HYDRAA) వ్యవస్థను తీసుకొచ్చామని, ప్రకృతి వనరులను కాపాడేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా మూసీ నదిని శుద్ధి చేసి, పర్యాటక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టామని వెల్లడించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక విచ్ఛిన్నతకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ తీరు వల్ల గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 15 నుంచి 25వ తేదీ వరకు జీతాలు రాని పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటించి, విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందని తెలిపారు. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని ప్రకటించారు. అంతేకాకుండా, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.

**ఆరు గ్యారెంటీలతో సుపరిపాలన**

ఎన్నికల్లో ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో వేగంగా అమలు చేస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపాయని వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయమే పునాదిగా సాగుతున్న తెలంగాణ పునర్నిర్మాణంలో విదేశాల్లో ఉన్న తెలుగు ఎన్ఆర్ఐలు, ఐఓసీ ప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి

రీజినల్ రింగ్ రోడ్డు (RRR) వేగవంతం చేయడం, మెట్రో రైలు రెండో దశ విస్తరణతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా రాబట్టడం వల్ల తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు టి రామ్మోహన్ రెడ్డి రాకేష్ రెడ్డి, కాలే యాదయ్య, దొంతి మాధవరెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఉత్సవాల నిర్వహణ కోసం బిచ్చమెత్తుకోవాలా?





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

రాష్ట్రంలో హిందు పండుగలు, ఉత్సవాల నిర్వహణ కోసం హిందువులంతా బిచ్చమెత్తుకునే దుస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత ఘనంగా నిర్వహించుకునే బోనాల ఉత్సవాల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. " బోనాల ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించి వదిలేసింది. ఆ మేరకు నిధులు ఇవ్వాలనే సోయే లేదు. రంజాన్ పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు ఇచ్చింది. 80 శాతానికిపైగా హిందువులు నిర్వహించుకునే బోనాల ఉత్సవాలకు మాత్రం రూ.20 కోట్లు మాత్రమే ఇస్తారా? హిందూ పండుగల కోసం హిందువులంతా బిచ్చమెత్తుకోవాలా?''అని ఆగ్రహం వ్యక్తం చేశారు.సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం సికింద్రాబాద్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు, భక్తులు పెద్ద ఎత్తున సంజయ్ కు స్వాగతం పలికారు. దారి పొడవునా భక్తులు ఎండలో క్యూలో నిలబడటం, వారికి తాగునీళ్లుసహా కనీస సౌకర్యాలు లేని విషయాన్ని గమనించారు. సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్న అంశాన్ని పలువురు భక్తులు సంజయ్ దృష్టికి తెచ్చారు. నేరుగా మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న బండి సంజయ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. ఏమన్నారంటే...బోనాల జాతర సందర్భంగా హిందూ బంధువులందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు. ఆషాఢ మాసంలో సికింద్రాబాద్ లో ఉజ్జయిని మహంకాళి బోనాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. జాతర సందర్భంగా నిర్వహించే రంగం అద్భుత ఘట్టం. మహంకాళి బోనాలకు ఒక చరిత్ర ఉంది. 1813 ప్రాంతంలో హైదరాబాద్–సికింద్రాబాద్‌లో కలరా, మశూచి వంటి అంటువ్యాధులు విజృంభించాయి. జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ఏం చేయాలో తెలియక జనం అల్లాడిపోతున్నరు. అప్పట్లో ఉజ్జయినిలో విధులు నిర్వహిస్తున్న సైనికులు మహంకాళి అమ్మవారిని ప్రార్థిస్తూ ''అమ్మా...ఈ వ్యాధి నుంచి మా ఊరి జనమంతా బయటపడితే తిరిగొచ్చి మేమంతా కలిసి నీకు బోనం సమర్పిస్తాం" అని వేడుకంటే అమ్మవారు కరుణించడంతో వ్యాధి తగ్గింది. ఫలితంగా ఆనాటి నుండి అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారు సరే... మరి నిధులేవి? గత ప్రభుత్వం తోపాటు ఈ ప్రభుత్వం కూడా బోనాల ఉత్సవాల నిర్వహణ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. తెలంగాణలో హిందువుల జనాభా 80 శాతం. కానీ ఆ స్థాయిలో నిధుల కేటాయింపు లేవి? రూ.20 కోట్లు మాత్రమే కేటాయిస్తారా? కనీస సౌకర్యాల్లేక భక్తులు అల్లాడుతున్నారు. ఎండకు తాళలేక ఇబ్బంది పడుతున్నారు. ఇదేనా ఉత్సవాల నిర్వహణ అంటే? మంత్రులు, సీఎం ఉన్నది ఆలయానికి వచ్చి దర్శనం చేసుకుని వెళితే సరిపోతుందా? భక్తుల బాధలు పట్టవా? సాక్షాత్తు సీఎం 'కాంగ్రెస్ అంటేనే ముస్లిం... ముస్లిం అంటేనే కాంగ్రెస్' అని చెప్పారంటే హిందువుల పట్ల కాంగ్రెస్ కు ఎంత చులకన ఉందో అర్థం చేసుకోవాలి.రంజాన్ పండుగకు రూ.33 కోట్లు ఇచ్చారు. కానీ 80 శాతమున్న హిందువుల పండుగ బోనాలకు మాత్రం రూ.20 కోట్లు ఇస్తారా? హిందువులు కాంగ్రెస్ పాలనలో బిచ్చమెత్తుకోవాలా? రేపు గణేష్ ఉత్సవాలు రాబోతున్నాయి. హిందువులంతా ఇట్లనే ఇబ్బంది పడాలా? ఇదేనా పాలనంటే?అందుకే హిందూ సమాజమంతా జాగ్రుతం కావాలి. ఒక్కటై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం బోనాలు, గణేశ్ ఉత్సవాల తోపాటు హిందువుల పండుగలకు, ఉత్సవాలకు జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరుతున్నా.

# డ్రగ్స్ నిర్మూలిస్తేనే వికసిత్ భారత్ సాధ్యం

- యువశక్తి ఆరోగ్యమే దేశ పురోగతికి మూలం
- వంద వారాల పాటు సాగనున్న 'నషా ముక్త్ భారత్'
- దేశవ్యాప్తంగా కోటి మంది యువతతో ప్రతిజ్ఞ

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 2:**

భారతదేశం ఆశిస్తున్న అభివృద్ధి లక్ష్యాల సాధనలో దేశ యువత ఆరోగ్యమే అత్యంత కీలకమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్"లో భాగంగా నిర్వహించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన వర్చువల్ విధానంలో పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధికి డ్రగ్స్ లేని సమాజం ఎంత అవసరమో ప్రధాని సుదీర్ఘంగా వివరించారు. ఈ ఉద్యమం కేవలం ఒక్క వ్యక్తికో లేదా ఒక కుటుంబానికో పరిమితమైంది కాదని, అంతకుమించి నవ భారత నిర్మాణానికై సాగుతున్న అతిపెద్ద జాతీయ యజ్ఞమని ఆయన అభివర్ణించారు. దేశం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్న వేళ యువత శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసంతో మెలిగి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' పేరిట ప్రత్యేక ప్రచారాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు కోటి మంది యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ఒకేసారి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మాట్లాడుతూ.. ఈ రోజు తీసుకున్న ప్రతిజ్ఞ రాబోయే 100 వారాల పాటు నిరంతర ఉద్యమంగా సాగుతుందని తెలిపారు. రాబోయే 100 ఆదివారాలు 'మాదకద్రవ్య రహిత భారత్' సాధనలో అత్యంత బలమైన అడుగులుగా మారనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రణాళికను వివరిస్తూ, గతంలో కాశీ నగరంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు రూపుమార్చుకుని దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. ప్రస్తుతం దాదాపు 125 ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక సంస్థల సహకారంతో ఈ ప్రచారం ప్రతి మూలకూ చేరుతోందని మోదీ వెల్లడించారు. యువత భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ఉపేక్షించేది లేదని, దానిని మూలాలతో సహా తరిమికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తోందని స్పష్టం చేశారు.అక్రమ రవాణాదారులు, డ్రగ్స్ ముఠాలపై ప్రభుత్వం శత్రువుపై దండెత్తినట్లే కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. గతంతో పోలిస్తే మాదకద్రవ్యాల విక్రేతల అరెస్టుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. అంతేకాకుండా దేశ సరిహద్దుల్లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ వేల కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని గుర్తుచేశారు. మత్తు పదార్థాల వ్యాపారం పట్ల తమ ప్రభుత్వం ఎంత నిర్దాక్షిణ్యంగా, కఠినంగా వ్యవహరిస్తోందో ఈ గణాంకాలే నిరూపిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రధాని యువతను హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం వల్ల లభించేది కేవలం తాత్కాలిక ఉత్సాహం మాత్రమేనని, కానీ అది వ్యక్తిగత జీవితాన్ని, కష్టపడి నిర్మించుకున్న కెరీర్‌ను పూర్తిగా నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి దేశ ప్రయోజనాలను, సొంత జీవితాలను దృష్టిలో ఉంచుకుని యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవ్వాలని, ఎలాంటి వ్యసనాల ఉచ్చులోనూ పడకూడదని ఆత్మీయంగా పిలుపునిచ్చారు.దేశం ప్రస్తుతం 'అమృత కాలం'లో ఉందన్న ప్రధాని, ప్రస్తుత యువతను భారతదేశపు అసలైన 'అమృత తరం'గా అభివర్ణించారు. రాబోయే 20 నుంచి 25 ఏళ్ల కాలం ప్రతీ ఒక్కరి జీవితంలోనూ చాలా కీలకమైనదని అన్నారు. 2047 నాటికి భారత్ 'వికసిత్ భారత్'గా అవతరించాలనే లక్ష్యానికి యువతదే పూర్తి సారథ్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన దేశం వల్ల కలిగే పూర్తి ప్రయోజనాలు పొందేది కూడా నేటి యువతయేనని, అందుకే దేశానికి యువత శక్తి, సృజనాత్మకత, నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు.మత్తు రహిత సమాజ స్థాపనలో విద్యాసంస్థలు, కుటుంబాలు భాగస్వామ్యం కావాలని ప్రధాని కోరారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు, యంత్రాంగానికి సూచించారు. సమాజంలో ఉన్న ఈ సమస్యను దాచకుండా అందరం ఐక్యంగా ఎదుర్కొని, మన సంతానాన్ని, యువ శక్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.చివరగా తల్లిదండ్రులకు ప్రధాని మోదీ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఒకవేళ ఇంట్లోని పిల్లలు ఎవరైనా పొరపాటున వ్యసనాలకు బానిసలైతే, సామాజిక ప్రతిష్ట దెబ్బతింటుందనే భయంతో ఆ విషయాన్ని దాచిపెట్టవద్దని కోరారు. దాచడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుందే తప్ప పరిష్కారం దొరకదని చెప్పారు. వెంటనే నిపుణులైన వైద్యులు, కౌన్సెలర్ల సహాయం తీసుకుని, సరైన వైద్య సేవలతో పిల్లలను ఆ వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి ధైర్యంగా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.

# సెల్ఫీ వీడియోలు తీస్తూ ప్రధానమంత్రి తన పదవీ గౌరవాన్ని తగ్గించుకోవద్దు

## ప్రజల ముందుకు వచ్చి మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:
దేశ ప్రధానమంత్రి పదవికి ఉన్న గౌరవం, బాధ్యత, రాజ్యాంగబద్ధమైన హోదాను కాపాడాల్సిన వ్యక్తి సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు సందేశాలు ఇవ్వడం దురదృష్టకరమని, ఇది ఆ పదవీ గౌరవాన్ని స్వయంగా తగ్గించుకునే చర్యగా కనిపిస్తోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ విమర్శించారు.శర్మ మాట్లాడుతూ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి దాదాపు 25 సంవత్సరాల రాజకీయ జీవితంలో ప్రతిపక్షాలను తీవ్రంగా విమర్శించిన నరేంద్ర మోదీ, దేశ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీన పరిచే రాజకీయాలకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలను బల హీనపరచడం, ఎన్నికైన ప్రజాప్రతినిధులను అధికార పార్టీ వైపు మళ్లించడం, కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ తదితర సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి సాధనాలుగా ఉపయోగించారనే ఆరోపణలు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలపరచాల్సిన సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారనే భావన ప్రజల్లో పెరిగిందని పేర్కొన్నారు.మీడియా స్వేచ్ఛ కూడా గత కొన్నేళ్లుగా తీవ్రంగా దెబ్బతిందని శర్మ ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే మీడియాను బల హీనపరచడం, అధికారానికి అనుకూలంగా వ్యవహరించే వాతావరణాన్ని ప్రోత్సహించడం వల్ల ప్రజలకు నిష్పాక్షిక సమాచారం అందకుండా పోతోందని అన్నారు. మీడియా ప్రశ్నలను ఎదుర్కొనకుండా, ఏకపక్ష ప్రసంగాలు, ముందుగా సిద్ధం చేసిన వీడియోల ద్వారా మాత్రమే ప్రజలను ఉద్దేశించి మాట్లాడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.ఇటీవల జరిగిన విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో సెల్ఫీ వీడియో విడుదల చేసి పోలీసుల పట్ల సానుభూతి వ్యక్తం చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని శర్మ అన్నారు. లాఠీచార్జీల్లో గాయపడిన విద్యార్థులు, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల బాధను ప్రస్తావించకుండా కేవలం పోలీసులను మాత్రమే ప్రస్తావించడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్య అని విమర్శించారు. జరిగిన ఘటనలపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు."దేశానికి 145 కోట్ల మంది ప్రజలకు ప్రధానమంత్రిగా ఉన్న వ్యక్తి సెల్ఫీ వీడియోల ద్వారా సమాధానాలు చెప్పే స్థాయిలో ఉండకూడదు. నిజంగా ప్రజల పట్ల బాధ్యత ఉంటే విలేకరుల సమావేశం నిర్వహించి మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మీడియాను ఎదుర్కొనే ధైర్యం లేకపోతే అధికారిక ప్రకటన విడుదల చేసి దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలి. కానీ సెల్ఫీ వీడియోల ద్వారా రాజకీయ ఇమేజ్‌ను కాపాడుకునే ప్రయత్నం చేయడం ప్రధానమంత్రి పదవికి తగినది కాదు" అని శర్మ అన్నారు.ప్రజాస్వామ్యంలో నాయకుడి గొప్పతనం ప్రచార వీడియోల్లో కాదని, ప్రజల ప్రశ్నలకు జవాబుదారీ తనంతో సమాధానం చెప్పడంలో ఉందని శర్మ పేర్కొన్నారు. దేశ ప్రజలు ప్రచార రాజకీయాలను కాదు, బాధ్యతాయుతమైన పాలనను కోరుకుంటున్నారని అన్నారు.చివరగా, రంగురంగుల ప్రచార కార్యక్రమాలు, సెల్ఫీ వీడియోలు, వ్యక్తిగత ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వడం కంటే దేశ యువత, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రధానమంత్రికి శర్మ విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవిస్తూ మీడియాతో స్వేచ్ఛగా మాట్లాడాలని, ప్రజల తీర్పే అంతిమమని గుర్తుంచుకోవాలని సూచించారు.ప్రధానమంత్రి తన సెల్ఫీ వీడియోలో తనను, తన మాతృమూర్తిని ఎంతగా దూషించినప్పటికీ తాను అందరినీ క్షమిస్తున్నానని చెప్పడం బాధాకరమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ అన్నారు.భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత శ్రీమతి సోనియా గాంధీ, భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ప్రధానమంత్రులు శ్రీమతి ఇందిరా గాంధీ, శ్రీ రాజీవ్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ, అలాగే నేటి యువతకు స్ఫూర్తిదాయక నాయకుడు శ్రీ రాహుల్ గాంధీపై భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంవత్సరాలుగా చేసిన వ్యక్తిగత విమర్శలు, ఉపయోగించిన అసభ్యకరమైన పదజాలం దేశ ప్రజలందరికీ తెలుసునని ఆయన పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు అసహ్యకరంగా, జుగుప్సాకరంగా ఉన్నాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు విద్యార్థులను ఉద్దేశించి తానే క్షమిస్తున్నానని ప్రధానమంత్రి చెప్పడం "దొంగే దొంగ" అన్నట్లుగా ఉందని ప్రసన్న కుమార్ శర్మ విమర్శించారు.ప్రధానమంత్రి సెల్ఫీ వీడియోలు చేయడం మానేసి, దేశ యువత, యువతీయువకుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పారదర్శకమైన పరీక్షా విధానాలను అమలు చేయించడం, నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు."మా తల్లిని తిట్టారు, నన్ను తిట్టారు, అయినా నేను క్షమిస్తున్నాను" అని చెప్పడం కంటే, ఈ దేశ ప్రజలే ప్రభుత్వాన్ని క్షమించాలా వద్దా అనేది నిర్ణయిస్తారని అన్నారు. లాఠీ దెబ్బలు తిన్న విద్యార్థులు, వారి కుటుంబాలు, ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ యువత అనుభవించిన బాధలను ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రచార వీడియోలు కాదు, ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపే పరిపాలనే అవసరమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ స్పష్టం చేశారు.



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ

# బాల్టిమోర్‌లో ఎన్ఆర్ఐ కమిటీతో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖాముఖి

హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 2:

అమెరికాలోని బాల్టిమోర్‌లో జరుగుతున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) మహాసభల సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు & అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులతో ముఖాముఖి సమావేశమయ్యారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసుల (ఎన్ఆర్ఐలు) సమస్యలు, సంక్షేమం, తెలంగాణతో వారి అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విదేశాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం, తెలంగాణలో పెట్టుబడులు, పర్యాటక రంగ అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవాస తెలుగువారితో ప్రభుత్వ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై పలు సూచనలు చేశారు.ప్రవాస తెలుగువారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటడంలో ప్రవాస తెలుగువారి పాత్ర ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులు, పర్యాటక ప్రోత్సాహం, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తుందని తెలిపారు.



# బాల్య మిత్రుడు శ్యామసుందర్ సింధే మృతి తీరని లోటు: ఆశోక్ ముస్తాపూరే రాష్ట్ర అధికార ప్రతినిధి, బిజెపి తెలంగాణ

ఆదిలాబాద్ వెలుతురు ఆగస్టు 02:

మా బాల్య మిత్రుడు శ్యామసుందర్ సింధే గారు తీర్థయాత్ర నిమిత్తం పండరిపురం వెళ్లి, అక్కడ దైవాజ్ఞ పొందడం అత్యంత తీవ్ర బాధాకరం, దిగ్భ్రాంతికరం. ఆధ్యాత్మిక చింతనతో కూడిన వారి జీవితం ఇలా పవిత్ర పుణ్యక్షేత్రంలో ముగియడం వారి దైవభక్తికి నిదర్శనం అయినప్పటికీ, మిత్రుడిగా వారిని కోల్పోవడం మాకందరికీ తీరని లోటు.ఈ రోజు మిత్రులమంతా కలిసి వారి స్వగృహానికి వెళ్లడం జరిగింది. శ్యామసుందర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించాము.ఈ కష్టసమయంలో వారి కుటుంబ సభ్యులకు నా లోతైన సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆ భగవంతుడు వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని, మనోనిబ్బరాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను.



# మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ & పబ్లిక్ రిలేషన్స్) హర్కర వేణుగోపాల్ రావు

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:
సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతర ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ & పబ్లిక్ రిలేషన్స్) హర్కర వేణుగోపాల్ రావుతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.తెలంగాణ ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించారు.లష్కర్ బోనాల జాతరలో ముఖ్యమంత్రి బోనం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.భక్తుల భారీ రద్దీ మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో లష్కర్ బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి.



# భారత్ ఆటోమొబైల్ రంగంలో మరో మైలురాయి: కేటో మోటార్స్ తొలి కమర్షియల్ ఎలక్ట్రిక్ బస్ ఆవిష్కరణ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి







**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

క్లీన్ ట్రాన్స్‌పోర్ట్, స్వదేశీ సాంకేతికత మరియు హరిత ఇంధన రంగంలో భారత్ మరో అడుగు ముందుకు వేసింది. దేశీయ దిగ్గజ సంస్థ 'కేటో మోటార్స్' (Keto Motors) తన మొట్టమొదటి కమర్షియల్ ఎలక్ట్రిక్ బస్‌ను విజయవంతంగా లాంచ్ చేసింది. దేశంలోని రద్దీని, ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రూపొందించిన ఈ 9-మీటర్ల ఎలక్ట్రిక్ బస్‌ను ఆపరేటింగ్ పార్టనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బస్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన ఇంజనీర్లు, యాజమాన్యం మరియు ఉద్యోగులకు అభినందించారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దూరదృష్టి నాయకత్వంలో మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, మరియు ఇన్నోవేషన్ రంగాల్లో దేశం అద్భుతమైన మార్పులను చూస్తోందని ఈ వేదిక ద్వారా స్పష్టమైంది.ఒకప్పుడు టీకాలు లేదా ఇతర అవసరాల కోసం దశాబ్దాల పాటు ఎదురుచూసే దుస్థితి నుంచి.. నేడు కోవిడ్ వ్యాక్సిన్‌ను మనమే స్వయంగా అభివృద్ధి చేసి, అభివృద్ధి చెందిన దేశాలకంటే ముందే ప్రపంచంలోని 60కి పైగా దేశాలకు అందించిన స్థాయికి భారత్ ఎదిగింది. ఇదే ఆత్మనిర్భరత ఇప్పుడు ఆటోమొబైల్ రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది.

ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఎలక్ట్రిక్ మొబిలిటీ అనేది కేవలం పెట్రోల్, డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయం మాత్రమే కాదు.

ఇది దేశం యొక్క

ఎనర్జీ సెక్యూరిటీ (ఇంధన భద్రత)

కాలుష్య నియంత్రణ (పొల్యూషన్ కంట్రోల్)

దిగుమతుల తగ్గింపు (ఇంపోర్ట్ రిడక్షన్)

సాంకేతిక ఆత్మనిర్భరతకు బలమైన బాటలు వేస్తోంది.

ఎలక్ట్రిక్ వాహనాల తయారీ నుంచి బ్యాటరీలు, ఛార్జింగ్ ఫెసిలిటీస్, రీసెర్చ్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ వరకు ప్రతి రంగాన్ని కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా అభివృద్ధి చేస్తోంది.

క్లీన్ ఎనర్జీ మరియు PSUల పాత్ర ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన విద్యుత్ కూడా హరితంగా (Clean Energy) ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సోలార్, విండ్, హైడ్రో మరియు గ్రీన్ ఎనర్జీ కారిడార్లలో భారీ పెట్టుబడులు పెడుతోంది.

ఈ క్రమంలో కోల్ ఇండియా, నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ (NLC) వంటి ప్రభుత్వ రంగ సంస్థలు (PSUs) సంప్రదాయ బొగ్గు ఉత్పత్తితో పాటు సోలార్, ఫ్లోటింగ్ సోలార్ మరియు పంప్డ్ స్టోరేజ్ రంగాల్లోకి విస్తరిస్తూ జాతీయ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి.

నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్

భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్, సెమీకండక్టర్లు, డిఫెన్స్ మరియు ఏఐ (AI) రంగాలకు వెన్నెముకగా నిలిచే లిథియం, కోబాల్ట్, నికెల్, కాపర్ వంటి క్రిటికల్ మినరల్స్‌కు చమురుతో సమానమైన వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది.

దీనిని దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం రూ. 34 వేల కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను చేపట్టింది.

### టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం ఫార్మా, ఐటీ, డిఫెన్స్‌తో పాటు ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్ మరియు సెమీకండక్టర్ డిజైన్ హబ్‌గా మారుతోంది. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సెమీకండక్టర్ కంపెనీలు తమ డిజైన్ సెంటర్లను ఏర్పాటు చేస్తుండగా.. తెలుగు యువ ఇంజనీర్లు ప్రపంచ స్థాయి చిప్‌లను తయారు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్' ద్వారా చిప్ తయారీ, రీసెర్చ్ మరియు డిజైన్ రంగాలకు భారీ ఆర్థిక ప్రోత్సాహకాలు అందుతున్నాయి.

### ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ అగ్రగామి

మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది.

నేడు దేశంలో వినియోగిస్తున్న స్మార్ట్ ఫోన్లలో 99.2 శాతం ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి.

ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, ఎగుమతులు 11 రెట్లు పెరగగా.. ఈ రంగం ద్వారా సుమారు 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది.

పీఎల్ఐ (PLI) పథకాలు, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో కేంద్రం ఎలక్ట్రానిక్స్ రంగానికి పూర్తి సహకారం అందిస్తోంది.

ప్రపంచంతో పోటీపడుతూ అద్భుతమైన మౌలిక వసతులు, రోడ్లతో




దూసుకుపోతున్న భారత్.. 'వికసిత భారత్ – 2047' లక్ష్య సాధన దిశగా పయనిస్తోంది. కేటో మోటార్స్ సాధించిన ఈ విజయం స్వదేశీ సామర్థ్యానికి నిదర్శనం. భవిష్యత్తులో మరింత అధునాతన పరిశోధనలతో కేటో మోటార్స్ పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తూ, దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు మరింత తోడ్పాటునందించాలని ఆకాంక్షిద్దాం.

## మై భారత్ ఆధ్వర్యంలో "నషా ముక్త్ యువ – వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" ప్రధానమంత్రి ప్రత్యక్ష వర్చువల్ ప్రసంగం వీక్షణ





**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 2:**

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా, మేరా యువ భారత్ (MY Bharat), ఆధ్వర్యంలో శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హైదరాబాద్ లో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రత్యక్ష వర్చువల్ ప్రసంగాన్ని వీక్షించే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా 10000కు పైగా కేంద్రాలను అనుసంధానిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ ప్రచార కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. తన ప్రసంగంలో యువత మాదకద్రవ్యాలు మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని, 2047 నాటికి నషా ముక్త్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సాధనకు ప్రతి పౌరుడు ఆరోగ్యవంతమైన, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మేరా యువ భారత్,ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు మరియు యువత "నషా ముక్తి ప్రతిజ్ఞ" చేసి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఇతరులను కూడా ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన శైలిని అవలంబించేలా ప్రేరేపిస్తామని సంకల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ఐఎస్‌టీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ శ్రీ పురుషోత్తం, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ విజయ్ భాస్కర్ రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీమతి ప్రీతి జీవన్ జిల్లా ఇన్ఫర్మాటిక్స్ ఆఫీసర్ శ్రీ మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు మరియు యువత పాల్గొన్నారు.కార్యక్రమంలో యువత ఉత్సాహభరితంగా పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, **నషా ముక్త్ భారత్ – వికసిత్ భారత్** లక్ష్య సాధనకు మేరా యువ భారత్ నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని హైదరాబాద్ జిల్లా యువజన అధికారి శ్రీ శశాంక్ రావుల తెలిపారు.

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 2:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో వరద ముప్పు నివారణకు, కబ్జాలకు గురైన చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'హైడ్రా' వ్యవస్థకు ప్రజల నుంచి అపారమైన మద్దతు లభిస్తోంది. ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తూ, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నివాసితులు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవను కొనియాడుతూ, హైడ్రా అధికారులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ నగర వీధుల్లో నినాదాలు చేశారు.అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్ సహా చుట్టుపక్కల ఉన్న పదుల సంఖ్యలోని కాలనీల సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కబ్జాదారులు, స్వార్థపరులు సోషల్ మీడియా వేదికగా హైడ్రా పై చేస్తున్న దుష్ప్రచారాన్ని నగరవాసులు తీవ్రంగా ఖండించారు. హైడ్రా వల్ల తమ ప్రాంతాల్లో వరద ముప్పు తగ్గిందని, ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉందంటూ వివిధ కాలనీల ప్రతినిధులు వీడియో సందేశాలు విడుదల చేసి తమ ఆకాంక్షను చాటిచెప్పారు.హైడ్రా సాధించిన అద్భుతమైన ఫలితాలే తమ ఈ మద్దతుకు ప్రధాన కారణమని సంక్షేమ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. గత రెండేళ్ల వ్యవధిలో కబ్జాదారుల బారిన పడకుండా సుమారు 3325 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించిందని తెలిపారు. ఈ భూముల బహిరంగ మార్కెట్ విలువ దాదాపు రూ. 1.50 లక్షల కోట్లు ఉంటుందని ప్రశంసించారు. దీనికి తోడు రెండు విడతలలో మొత్తం 20 చెరువులను శాస్త్రీయంగా పునరుద్ధరించి, ఆయా పరిసర ప్రాంత ప్రజలకు వరద భయం లేకుండా చేయడాన్ని నగరవాసులు కళ్లారా చూశారని పేర్కొన్నారు.గతంలో కేవలం 5 సెంటీమీటర్ల వర్షం పడితే చాలు అమీర్‌పేట, శ్రీనివాసనగర్, మధురానగర్ వంటి ప్రాంతాలు జలమయమై ఇళ్లల్లోకి నీరు చేరేదని స్థానికులు గుర్తుచేశారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని హైడ్రాను రంగంలోకి దించడంతో పరిస్థితులు పూర్తిగా మారాయన్నారు. వర్షపు నీటి కాల్వలు, నాలాల్లో ఉన్న అడ్డంకులను తొలగించి, నీరు వేగంగా ముందుకు సాగేలా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకున్నారని కొనియాడారు.హైడ్రా కేవలం ఒకే రకమైన చర్యలకు పరిమితం కాకుండా జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ వంటి కీలక శాఖలతో సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటోందని ప్రజలు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులను ఒకే తాటిపైకి తెచ్చి, కేవలం వారం రోజుల వ్యవధిలోనే క్లిష్టమైన వరద నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించడం అభినందనీయమని చెప్పారు. ప్రభుత్వ వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో హైడ్రా నిరూపించిందన్నారు.నగరంలో విలువైన ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకున్న కొందరు బడా కబ్జాదారులు, వారికి వెన్నుదన్నుగా నిలిచే రాజకీయనాయకులు తమ అక్రమ సంపాదనకు గండి పడటంతోనే ఓర్వలేకపోతున్నారని స్థానికులు ఆరోపించారు.

## జెన్ జీ మద్దతు బీజేపీకే

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 2:**

నవతరం యువత (జెన్ జీ) ఎల్లప్పుడూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వైపే ఉన్నారని, సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి సంపూర్ణంగా అండగా నిలుస్తుందనే నమ్మకం తమకు ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయెల్ ఆదివారం స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' ప్రచారాన్ని ఈ సందర్భంగా ఆయన విశేషంగా ప్రశంసించారు. దేశ యువతలో ఉన్న అసమానమైన ఉత్సాహం, చైతన్యమే భారతదేశాన్ని అతి త్వరలోనే మాదకద్రవ్య రహిత దేశంగా మారుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.యువత తోడ్పాటుపై మాట్లాడిన పీయూశ్ గోయెల్, "జెన్ జీ ఎప్పుడూ మా వెంటే ఉన్నారు. వారి అపారమైన మద్దతు, యువ శక్తి లేకపోతే ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రిగా గెలిచి ఉండేవారు కారు" అని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీతో కలసి నడుస్తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందన్నారు. భారతదేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే నవతరం యువతీ యువకుల తపన 'వికసిత్ భారత్' నిర్మాణానికి బలమైన పునాది వేస్తుందని చెప్పారు. ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా దేశంలోని యువత అంతా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ సామూహిక పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పీయూశ్ గోయెల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో, ముఖ్యంగా నవతరం యువతలో ప్రధాని మోదీకి నానాటికీ పెరుగుతున్న ఆదరణను చూసి రాహుల్ గాంధీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రాహుల్ గాంధీ తనను తాను యువ నాయకుడిగా చెప్పుకునేవారని, అయితే ఇప్పుడు యువతలో ఆయనకు ఎలాంటి ప్రజాదరణ లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కొత్తగా ఓటు హక్కు పొందుతున్న యువ ఓటర్ల మద్దతు ఎప్పుడూ బీజేపీకే ఉంటుందని, భారతదేశాన్ని స్వయం సమృద్ధి కలిగిన అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ప్రధాని మోదీ ఆశయాలకు యువత జై కొడుతోందని చెప్పారు.1997 నుంచి 2012 మధ్య కాలంలో జన్మించిన యువతను సాంకేతికంగా 'జెన్ జీ' (Gen Z) గా వ్యవహరిస్తారు. ఈ తరానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రధాని మోదీ 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు 28 వేలకు పైగా ప్రాంతాల్లో ఉన్న కోటి మందికి పైగా యువతీ యువకులతో వీడియో కాన్ఫరెన్సింగ్ విధానం ద్వారా ప్రధాని నేరుగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మహా ఉద్యమం కేవలం ఒక్కరి వ్యక్తిగత శ్రేయస్సు కోసమే కాకుండా, కుటుంబాలు, సమాజం మరియు యావత్ దేశ విస్తృత ప్రయోజనాలను కాపాడటానికి ఉపయోగపడుతుందని మోదీ స్పష్టం చేశారు.అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) కలను సాకారం చేసుకోవాలంటే దేశంలో మాదకద్రవ్య రహిత సమాజం ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని నొక్కి చెప్పారు. ముఖ్యంగా రేపటి పౌరులైన యువత శారీరకంగా ఎంతో ఆరోగ్యంగా, మానసికంగా అత్యంత దృఢంగా మరియు ఆత్మవిశ్వాసంతో ఉండాలని ఆకాంక్షించారు. జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ వంటి వినాశకరమైన అలవాట్లకు, వ్యసనాలకు యువత ఎల్లప్పుడూ శాశ్వతంగా దూరంగా ఉండాలని మోదీ హితవు పలికారు.ఈ కార్యక్రమం నేపథ్యాన్ని వివరిస్తూ, గతేడాది కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ మాదకద్రవ్య వ్యతిరేక ప్రచారం, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం దేశంలోని సుమారు 125 ప్రముఖ ఆధ్యాత్మిక మరియు సామాజిక సంస్థల భాగస్వామ్యంతో ఈ ఉద్యమం బహుళ ప్రాచుర్యం పొందుతోందన్నారు.

## గోదావరి శాంతిస్తోంది..

- **రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన అధికారులు**
- **మొదటి ప్రమాద హెచ్చరిక మాత్రం కొనసాగింపు**
- **ముంపు రహదారులపై పునరుద్ధరమైన రాకపోకలు**
- **పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుతున్న బాధితులు**

**భద్రాచలం, వెలుతురు, ఆగస్టు 2:**

భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 46.7 అడుగులకు చేరగా, 10.83 లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అయితే మొదటి ప్రమాద హెచ్చరిక మాత్రం కొనసాగుతోంది. సాయంత్రానికి వరద మరింత తగ్గే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.భద్రాచలంతో పాటు దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల్లో రహదారులపై చేరిన వరదనీరు తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముంపు ప్రభావం తగ్గడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.బూర్గంపాడు మండలంలోని సారపాక, మోతే గ్రామాల్లో ఇళ్ల వరకు చేరిన వరదనీరు కూడా తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులు క్రమంగా తమ ఇళ్లకు తిరిగి వెళుతున్నారు.అయితే భద్రాచలం స్నానఘట్టాల వద్ద ఇంకా చాలా మెట్లు వరదనీటిలోనే ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

# వృద్ధుల చిరునవ్వుల్లో సేవా సంతృప్తి

**జాయ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఐబీఎస్ హైదరాబాద్ కమ్యూనిటీ వెల్ఫేర్ డెవలప్మెంట్, క్లబ్ ఐనా సేవా కార్యక్రమం**

**శంకర్ పల్లి , వెలుతురు , ఆగస్టు 2 :** ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ పరిధిలోని ఐబీఎస్ హైదరాబాద్‌కు చెందిన కమ్యూనిటీ వెల్ఫేర్ డెవలప్మెంట్, క్లబ్ ఐనా సంయుక్త ఆధ్వర్యంలో మొకిల గ్రామంలోని జాయ్ ఫౌండేషన్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆదివారం హృదయాలను హత్తుకునే సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి వాలంటీర్లు, క్లబ్ సభ్యులు వృద్ధులతో ఆప్యాయంగా మమేకమై వారికి ప్రేమ, ఆత్మీయతను పంచి ప్రత్యేక అనుభూతిని కలిగించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వృద్ధులతో సుదీర్ఘంగా సంభాషిస్తూ వారి జీవిత అనుభవాలు, మధుర జ్ఞాపకాలను ఆసక్తిగా ఆలకించారు. అనంతరం పాటలు, వినోదాత్మక ఆటలు, నృత్యాలతో వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు, వృద్ధులు కలిసి గడిపిన ఆనంద క్షణాలతో వృద్ధాశ్రమం ఆప్యాయత, ఆనందంతో కళకళలాడింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వృద్ధులకు ప్రేమతో పలకరించడం, కొంత సమయం కేటాయించడం వంటి చిన్న చర్యలే వారికి అపారమైన ఆనందాన్ని కలిగిస్తాయని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, మానవీయ విలువలు, సేవా భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు జట్టుగా పనిచేయడం, సామాజిక సేవలో భాగస్వాములు కావడం, పెద్దల పట్ల గౌరవం, సానుభూతిని పెంపొందించుకోవడం వంటి విలువైన అనుభవాలను సొంతం చేసుకున్నారని తెలిపారు. సేవ, స్నేహం, మానవత్వం, సామాజిక బాధ్యతకు ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని శరణ్య, కీర్తి సమన్వయం చేయగా, క్లబ్‌కు చెందిన జూనియర్, సీనియర్ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమంలోని మధుర క్షణాలను చిత్రీకరించిన నజారియా కవరేజ్ పార్ట్నర్ బృందానికి, అలాగే అంకుష్ , ఆయన బృందానికి కమ్యూనిటీ వెల్ఫేర్ డెవలప్మెంట్, క్లబ్ ఐనా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాయి.








# ఉప్పరపల్లిలో ఘనంగా ఆషాఢ మాస బోనాల నిర్వహణకు సన్నాహాలు

- **సామ భూపాల్ రెడ్డి అధ్యక్షతన గ్రామ ముఖ్య నాయకుల సమావేశం**
- **ఆగస్టు 9న మాంకాలమ్మ బోనాలు, ఆగస్టు 10న పోచమ్మ బోనాలు**

**ఉప్పరపల్లి వెలుతురు ఆగస్టు 02:**

ప్రతి ఏటా ఆషాఢ మాసంలో లష్కర్ బోనాల అనంతరం ఆనవాయితీగా వచ్చే ఉప్పరపల్లి బోనాల పండుగను ఈ సంవత్సరం కూడా ఎంతో వైభవంగా, ఐక్యమత్యంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం రోజున ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు సమావేశమై బోనాల ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి సామ భూపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ... "ఆషాఢ మాసంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, చెట్లు చిగురించి, పంటలు బాగా పండాలని అలాగే గ్రామ ప్రజలకు ఎలాంటి రోగాలు, జబ్బులు రాకుండా పోచమ్మ తల్లి చల్లగా చూడాలని కోరుకుంటూ బోనాలు సమర్పించడం మన ఉప్పరపల్లి ఆనవాయితీ. ఊరి ప్రజలందరం కలిసికట్టుగా, భక్తిశ్రద్ధలతో ఈ ఆషాఢ మాస బోనాలను జరుపుకుంటాం" అని తెలిపారు.





ఉప్పరపల్లి బోనాల సమయం:

ఆగస్టు 9: మాంకాలమ్మ బోనాలు

ఆగస్టు 10: పోచమ్మ బోనాలు

గ్రామ ప్రజలందరూ విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరడమైనది. ఈ సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు సామ భూపాల్ రెడ్డి, పి జయరాం. బొక్క బాల్ రెడ్డి, జి. కృష్ణ గౌడ్, వై. మోహన్ రెడ్డి, ఎస్. విట్టల్, పుస్తకాల నర్సింగ్ రావు, ఆర్. నరసింహా రెడ్డి, పుస్తకాల శ్రీనివాస్, శివకుమార్ రెడ్డి, వై. సంజీవ రెడ్డి, రాం రెడ్డి, మల్లారెడ్డి, ఏ. భూపాల్ రెడ్డి, ఏ. కిషన్ రావు, పి. కృష్ణ గౌడ్ (కిట్టు), బుచ్చి రెడ్డి, విజయ్ పాల్ రెడ్డి, వై. శ్రీధర్ రెడ్డి, సదానందం, సురేష్ గౌడ్, బొక్క ప్రభాకర్ రెడ్డి, కే .నరసింహా రెడ్డి, సిహెచ్ వెంకట్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, కీర్తి ప్రదీప్, జైపాల్ రెడ్డి, పుస్తకాల మహేష్, యు రాజేష్, మదం రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్న అనేకమంది ఉప్పరపల్లి ముఖ్య నాయకులు.

# స్నేహితుల దినోత్సవం వేళ..

## 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి శంకరపల్లి బాలుర పాఠశాల విద్యార్థులు!

**శంకర్ పల్లి, వెలుతురు ఆగస్టు 2 :**



స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శంకరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ 2006 – 2007 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. దాదాపు 20 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్నేహితులంతా ఒకే వేదికపైకి చేరడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి ఆ కాలంలో విద్యనందించిన అప్పటి ప్రధానోపాధ్యాయులతో పాటు గురువులైన బాల్ రెడ్డి, సురేష్, శ్రీశైలం, అంజయ్య, సత్యనారాయణ, పెంటయ్య, మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీదేవి, అంబిక, కిషన్ గార్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలు వాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.గురువులు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల తర్వాత తమ విద్యార్థులందరినీ ఇలా ఒకే చోట, ఉన్నత స్థానాల్లో చూడడం ఎంతో గర్వంగాను, సంతోషంగాను ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ ఫ్రెండ్‌షిప్ డే తమ జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రత్యేకమైన రోజు అని కొనియాడారు.ఈ సమ్మేళనంలో శంకరపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన వందకు పైగా పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ కమిషనరేట్ లో డయల్-100 ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

**సైబరాబాద్, వెలుతురు ఆగస్టు 02:**

అత్యవసర డయల్–100 ఫిర్యాదును పట్టించుకోకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ యూనస్ (హెచ్‌సీ–661)ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం.రమేష్ సస్పెండ్ చేశారు. ఆగస్టు 1 అర్ధరాత్రి గచ్చిబౌలి ఐకియా సమీపంలో జరిగిన రెండు కార్లు ఢీకొన్న ఘటనలో బాధితుడు డయల్–100కు రెండు సార్లు ఫోన్ చేసి పోలీసు సహాయం కోరాడు. ఇన్‌చార్జిగా ఉన్న హెచ్‌సీ సయ్యద్ యూనస్ సంఘటనా స్థలానికి వెళ్లకుండా "కాలర్ వల్ల ఇబ్బంది" అంటూ రెండు ఫిర్యాదులను మూసివేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటన పై సయ్యద్ యూనస్‌ను సైబరాబాద్ సిపి తక్షణమే సస్పెండ్ చేశారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని సైబరాబాద్ సిపి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఆరుట్ల పోచమ్మ దేవాలయంలో కుల సంఘాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్

- **ఈనెల19వ తేదీ ఆరుట్ల పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు పార్టీలకతీతంగా పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకోవాలి**
- **పోచమ్మ దేవాలయం నిర్మాణ దాత వెదిరె పాండురంగారెడ్డి, గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్**

**మంచాల వెలుతురు ఆగస్టు 02:**మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా ఆరుట్ల గ్రామం లోని అన్నికుల సంఘాలు వివిధ పార్టీల నాయకులు వివిధ యువజన సంఘాల యువకులతో పోచమ్మ దేవాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన ఆరుట్ల గ్రామ–సర్పంచ్ మానిపాటి శోభ కుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ ఈసందర్భంగా దేవాలయ పండితుడు శ్రీధర్ పోచ మ్మ బోనాల ఉత్సవాల తేదీని ప్రకటించారు ఈనెల19తేదీ బుధవారం రోజు పోచమ్మ తల్లి బో నాల ఉత్సవాలు జరిపించాలని అన్నారు కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోచమ్మ గుడి నిర్మాణదాత పెద్దలు వెదిరె పాండు రంగారెడ్డి మాట్లాడుతూ పోచమ్మ బోనాల ఉత్సవాలు పార్టీలకు అతీతంగా కులమతాలకు అతీతంగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించాలి అని అన్నారు దేవాలయ అభివృద్ధి కోసం నావంతు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను అని అన్నారు ఈకార్యక్రమంలో వివిధ కుల సంఘాల పెద్దలు మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్ రావుల భాష మొగ్గి ఐలయ్య చిందం రఘుపతి ఐలయ్య రావుల రాఘవ మాడుగుల బుచ్చయ్యగౌడ్ తంగడిపల్లి నరేందర్ గౌడ్ మాడుగుల కృష్ణ గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ కావలి బుగ్గ రాములు ముదిరాజ్ గుడ్డి మల్ల చంద్రయ్య ముదిరాజ్ దాసర మోని మారయ్య ముదిరాజ్ రమేష్ ముదిరాజ్ తలారి కృష్ణముది రాజ్ సతీశ్ ముదిరాజ్ బుట్టి కృష్ణ ముదిరాజ్ కొంగర వెంకట్ రెడ్డి మొద్దు సికిందర్ రెడ్డిదంటు మధుసూదన్ రెడ్డి దండు గోపాల్ రెడ్డి గంట నరసింహారెడ్డి లొంగరి మారయ్య బోయ పల్లిఅంజ య్య మాడపాకుల మారయ్య రాజు కాసుల అంజయ్య కొండిగారి శంకరయ్య పుల్లగల్ల గోపాల్ ప్రజాగలం దామెర భూపాల్ ఆమంచ మల్లయ్య ఎన్నుదుల సురేష్ సాతిరి పాండు చింతల శ్రీని వాస్ కొల్లోజు శాలవాచారి గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు కొండిగారి శ్రావణ్ పంది శేఖర్ ఆనంగల్ల జగన్నాథం మంకు మమత వినోద్ మంద మాధవి మోహన్ రెడ్డి రావుల జంగ య్య మానిపాటి భానుప్రసాద్ మాడుగుల బాలమని కృష్ణ గౌడ్ మొగ్గి పద్మఐలయ్య లాలగారి మన్నెమ్మ సాతిరి సత్యం గ్రామ పెద్దలు యువజన సంఘాల యువకులు పాల్గొన్నా.



# ఏంటిపిఆర్ ఫిక్స్డ్ టర్మ్ కార్మికులను పర్మనెంట్ చెయ్యాలి

- **సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 02 (వెలుతురు) :**

ఐడీపీఎల్లోని ఏంటిపిఆర్ కంపెనీ ఫిక్స్డ్ టర్మ్ కార్మికులు చేస్తున్న ధర్నా కార్యక్రమాన్ని సిపిఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏంటి ఏఆర్ కంపెనీలో సుమారు 450 మంది కార్మికులు గత 10 సంవత్సరలుగా పనిచేస్తున్నప్పటికి వారిని పర్మనెంట్ చెయ్యకుండా కాంట్రాక్ట్ కార్మికుల్గా పరిగణించడం వల్ల వారికి జీతాలు చాలా తక్కువగా వస్తున్నాయని సుప్రీం కోర్టు చెప్పినట్లు సమాన పనికి సమాన వేతనం తీర్పును ఉల్లఘించినట్టేనని కావున ఈ కంపెనీ నిర్దోషిగా ఉంటుందన్నారు. కంపెనీలో జరుగు తున్న ఎవరు పట్టించుకోకపోవడం దారుణమని ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటానికి సిపిఐ, ఏఐటీయూసీకి పూర్తి మద్దతు ఉంటుందని ఈ అంశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబాశివరావుకి తెలిపి వారికి మద్దతుగా నిలబడేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, ఏఐటీయూసీ అధ్యక్షులు హరినాథరావు, జావీద్, జంబూ, సీఐటీయూ నాయకులు రమేష్, రాజశేఖర్, లక్ష్మణ్, అశోక్, లింగస్వామిలతో పాటు వందలాది మంది పాల్గొన్నారు.



# ఆరుట్లలో బిఅర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- **ప్రజలు ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలకు దూరంగా ఉండాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి**
- **పేద ప్రజల కండల్లో ఆనందం చూడడమే బిఅర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం**
- **ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఅర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బూడిద రాంరెడ్డి**

**మంచాల వెలుతురు ఆగస్టు 02:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బిఅర్ఆర్ ఫౌండేషన్ సాయి కీర్తన్ రెడ్డి లేగసిట్రస్ట్ ఆ ధ్వర్యంలోహైదరాబాద్ పాయనీర్ హాస్పిటల్ వారి వైద్యుల చేత ఉచితవైద్య శిబిరంనిర్వహిం చారు శిబిరానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డిజిల్లా బిఅర్ ఎస్ పార్టీఅధ్యక్షుడు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి బిఅర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బూడిద రాంరెడ్డి ఆరుట్ల గ్రా మ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ హాజరై ఉచితవైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ బూ డిద రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజలు రోజుతినే ఆహారంలో ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలు తినకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని అన్నారు యువకులు మద్యపానానికి బానిసై ఆరో గ్యాన్ని పాడు చేసుకోవద్దు అని అన్నారు ఆరోగ్యానికి ఎలాంటి చిన్నపాటి హాని కలిగినఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి అని అన్నారు గ్రామంలోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాల ను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు పేదప్రజల కండల్లోఆనందం చూడడమే బిఅర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బూడిద రాంరెడ్డి లక్ష్యం ఉచిత వైద్యశిబిరానికి గ్రామం లోని ప్రజలు పెద్దఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు కొంతమంది పరీక్షలు చేయించుకున్నారు వైద్యపరీక్షలు చేయించుకున్నవారికి బిఅర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బూడిద రాంరెడ్డి మందులు పంపిణీ చేశారు కంటి పరీక్ష చేయించుకున్న వాళ్లకు అద్దాలు అవసరం ఉన్నవారికి త్వరలో అద్దాలు పంపిణీ చేస్తాం అని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు ఉచిత వైద్యశిబిరంలో పయనీర్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది ఆధ్వర్యంలో 600 మందికి సాధారణ వైద్యపరీక్షలు సా దూరం డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి గారి నేతృత్వంలో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏర్పుల చంద్రయ్య ఆరుట్ల మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్ మాజీ ఎంపీపీ మంకు ఇందిర వార్డు సభ్యులు పున్నం రాము లాలగారి మణెమ్మ.మాడుగుల బాలమని కృష్ణగౌడ్ రావుల జంగయ్య కొండిగారి శ్రవణ్ పంది శేఖర్ మొగ్గి పద్మ ఐలయ్య బిఅర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఉప్పరిగూడ సర్పంచ్ నందకుమర్ బూడిద మనీ ష్ రెడ్డి నర్సింహా రెడ్డి మదుపు గోపాల్ మంగ ఐలేష్ చిన్న రామ్ రెడ్డి జపాల సర్పంచ్ రవి బోడ కొండ సర్పంచ్ టిల్లు నాయక్ నోముల కరుణాకర్ రెడ్డి బకున చంద్రకాంత్ మహమ్మద్ సద్దాం మంకు వినోద్ బైకని మహేందర్ యాదవ్ బర్మల వెంకటేష్ మహమ్మద్ షకీర్ పొలమోని శ్రీకాంత్ ముదిరాజ్ బాహుబలి శివ , గ్రామపెద్దలు యువకులు పాల్గొన్నారు





# శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 02:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్‌లో నిర్వహించిన శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూన శ్రీశైలం గౌడ్ ఆ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నరు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వెంకటేష్ ముదిరాజ్, 296 డివిజన్ ప్రెసిడెంట్ జక్కుల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్, ఉదయ్ గౌడ్, బాల్ రెడ్డి, నవీన్ గౌడ్, ఆకుల మల్లేష్, కావలి శివకుమార్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- 83 కోట్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేసుకున్నాం
- నల్లగొండ పట్టణ తాగునీటి అవసరాల కోసం సిఎం రేవంత్ రెడ్డి గారు మరో 300కోట్లు మంజూరు చేశారు
- సిసి రోడ్లు, డ్రైనలతో పాటు, ప్రతి ఇంటికి 24 గంటలు తాగునీరు,పేదవారికి సంక్షేమ పథకాలు
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**నల్గొండ వెలుతురు ఆగస్టు 02:**



నల్గొండ పట్టణంలోని ప్రతి డివిజన్లో సిసి రోడ్లు, డ్రైనలతో పాటు, ప్రతి ఇంటికి 24 గంటలు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం నాడు మంత్రి నల్గొండ తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల కింద 64 మంది లబ్ధిదారులకు 64 లక్షల 7424 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్లో ఇదివరకే సిసి రోడ్లు, మురికి కాలువలు చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా తాగునీటి వాటర్ ప్లాంట్ కు 83 కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేయించడం జరిగిందని, అంతేకాక మరో 300 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి తాగునీటి కోసం పట్టణానికి మంజూరు చేశారని చెప్పారు. నల్గొండ మునిసిపాలిటీ కార్పొరేషన్ అయినందున కేంద్రం నుండి 1000 కోట్ల రూపాయల నిధులు వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. పట్టణంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇస్తున్నామని, అంతేకాక ఇదివరకే 700 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని ,ఇల్లు రానివారు సొంత స్థలాలు ఉంటే ఈ సంవత్సరం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజా ప్రభుత్వం పేదవారిదని, అందువల్ల పేదల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, నల్గొండ పట్టణంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటితో పాటు, అన్ని రకాలుగా మంత్రి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం రేషన్ కార్డులు, సన్న బియ్యం,



ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం మాట్లాడారు. ఎంపీడీ వో యాకూబ్ నాయక్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ రఫీ ఉద్దీన్, పిఎసిఎస్ అధ్యక్షులు నాగరత్నం ,ఇతర కార్పొరేటర్లు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి సాయి నగర్లో నిర్మాణంలో ఉన్న పెద్ద డ్రైన్ పనుల పురోగతిని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ -2 కింద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు మంజూరైన పనులను పబ్లిక్ హెల్త్ ఏస్ ఈ వెంకటేశ్వర్లు ద్వారా అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సదర్శాపురం రహదారిని వెంటనే బాగు చేయండి

**మోత్కూర్, ఆగస్టు02,వెలుతురు న్యూస్ :**

మోత్కూరు మండలం సదర్శాపురం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది.గత కొన్ని సంవత్సరాలుగా ఈ రహదారి పూర్తిగా చెడిపోయిందని ఈ రహదారిని వెంటనే బీటీ రోడ్డు గా మార్చాలని బీజేపీ మోత్కూర్ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రహదారిని పరిశీలించారు. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాల కారణంగా రహదారి మరింత ప్రమాదకరంగా మారిందని, గుంతలతో నిండిపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు, రైతులు, అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ రహదారిపై అధికారులు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని, వారు కోరారు. ఊరిలో పేరుకు పెద్ద పెద్ద నాయకులు ఉన్నా కనీసం వారి సొంత ఊరికి రోడ్డు మంచిగా



వేసుకోవాలన్నా సోయి లేదని విమర్శించారు .ఈ కార్యక్రమంలో బీజేపీ మోత్కూర్ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు జితేందర్ రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు భీముడి తిరుమలరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గుంటి సతీష్, బూత్ అధ్యక్షుడు చిలుకా నరసింహ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మరోసారి మానవత్వం చాటుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

- 18 లక్షలు ఖర్చు చేసి 23 ఏళ్ల యువకున్ని బతికించిన మానవతావాది
- నాంపల్లి మండలం ఫకీర్ పురానికి చెందిన ముదిగొండ యాదయ్య తండ్రి కృష్ణయ్య తీవ్ర అనారోగ్య సమస్యతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో జూబ్లీహిల్స్ అపోలోలో మెరుగైన చికిత్స అందించి ప్రాణం పోసిన ప్రాణదాత



- పార్టీలకతీతంగా ప్రాణాలు నిలబెడుతున్న రాజ్ గోపాల్ రెడ్డి

**నాంపల్లి వెలుతురు ఆగస్టు 02:**



రాజ్ గోపాల్ రెడ్డి గారు చేసిన సేవను జీవితాంతం గుర్తుంచుకుంటామని కుటుంబ సభ్యులు, ఇంత మంచి మానవత్వం ఉన్న వ్యక్తి మాకు ఎమ్మెల్యేగా ఉండడం మా అదృష్టం అంటూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నేవూరి ధర్మేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా బ్రెడ్డు , పండ్లు పంపిణి

**మోత్కూర్, ఆగస్టు02,వెలుతురు న్యూస్ :**

మలిదశ తెలంగాణ ఉద్యమ నేత ఉస్మానియా ముద్దు బిడ్డ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా యాదాద్రి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలో దాసరి తిరుమలేష్ ఆధ్వర్యంలో మోత్కూర్ ప్రభుత్వ ధవాఖానాలో రోగులకు మరియు వృద్ధులకు పండ్లు మరియు బ్రెడ్ పంపిణి కార్యక్రమం ఏర్పాటు చెయ్యగా ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మోత్కూర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ అధ్యక్షులు జంగ శ్రీను గారు రోగులకు పండ్లు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణి చేశారు ఈ కార్యక్రమంలో బి . ఆర్. ఎస్ నాయకులు చేతరాశి వెంకన్న అన్నందాసు విద్య సాగర్, జిట్ట సాయికుమార్,దాసరి నరేష్,గుగ్గిళ్ళ కృష్ణ, కందుకూరి





యాదగిరి,అజయ్,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్లో జిల్లా నిరుద్యోగ యువతకు అన్యాయం: ఏఐవైఎఫ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 02:**

అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రామన్నపేట 12వ మండల నిర్మాణ మహాసభ ఎర్ర రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ జూలై 29న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ లో కోడ్ నెంబర్ 21 సివిల్ కానిస్టేబుల్ ,కోడ్ నెంబర్ 22 ఏఆర్ కానిస్టేబుల్ జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లా (ఖాళీలు)లేకపోవ డం వల్ల జిల్లాకు సం బంధించిన నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 317 జీవో ప్రకారం యాదా ద్రి భువనగిరి జిల్లా, రాచకొండ పరిధిలో ఉండేది నల్గొండ సూర్యాపేట ఇతర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు యాదాద్రి జిల్లాలో విధులకు కేటాయించబడ్డారు. ఈ కేటాయింపు పారదర్శకంగా జరగలేదన్నారు. అనంతరం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి యాదాద్రి భువనగిరి జిల్లాను రాచకొండ కమిషనరేట్ పరిధి నుండి వేరు చేసి 6నెలలు గడుస్తున్నప్పటికీ ఇతర జిల్లాలకు చెందిన కానిస్టేబుల్ లను వారు సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేయకపోవడం వల్ల నల్లగొండ సూర్యపేట జిల్లాలో గణనీయమైన ఖాళీలు ఏర్పడ్డాయి కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఖాళీలు లేకుండా పోయింది. జిల్లాకు చెందిన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే ఇతర జిల్లాల నుంచి వచ్చిన కానిస్టేబుళ్లను సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేసి వాస్తవిక ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ వెయ్యాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు.దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువతపై జరిగిన లాఠీచార్జి ప్రజాస్వామ్యం పై దాడి అని సమగ్ర విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. విద్యా వైద్యం ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 8, 9 10 తేదీల లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ యువ జన




ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనం తరం నూతన కమిటీని ఎన్ను కోవడం జరిగింది అధ్యక్షులుగా కళ్లెం స్వామి, ఉపాధ్యక్షులు వినయ్ ప్రధాన కార్యదర్శిగా రచ్చ దయాకర్ సహాయ కార్యదర్శి కొత్త లింగస్వామి, కోశాధికారిగా ఊట్కూరి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకో వడం జరిగింది. ఈ నిర్మాణ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నయీం, జిల్లా కోశాధికారి సాయి, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి ,పాండు , వీసం గాలయ్య, నాగరాజు, సంగిశెట్టి నవీన్, పాల్గొన్నారు.

## తుమ్మలగూడెం పరిధి లో 11కెవి అగ్రీ గృహ విని యోగదారుల, ఇండస్ట్రియల్ ఫీడర్లు అంతరాయం

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 02:**

3/08/2026 సోమవారం రోజున 33/11కెవి తుమ్మలగూడం పరిధిలో 11 కెవీ డెడికేటెడ్ ఫీడర్ లైన్ వర్క్ చేస్తున్న కారణముగా ఈరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయత్రం ..5.00 వరకు తుమ్మలగూడం గ్రామానికి చెందిన 11 కెవీ ఇండస్ట్రియల్ ఫీడర్ (గృహ వినియోగ దారులకు) మరియు తుమ్మలగూడం 11 కెవీ.. అగ్రీ ఫీడర్లో అంతరాయం ఉంటుంది కాబట్టి వినియోగదారులు సహకరించగలరు కోరుతున్నాము.

## భారతదేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న అమెరికా

- ట్రంప్‌కు లొంగిపోయిన దేశ ప్రధాని మోదీ
- సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 02:**




సిపిఎం రామన్నపేట మండల రాజకీయ శిక్షణా తరగతుల రెండవ రోజు కార్యక్రమం ఎంజీ గార్డెన్‌లో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు "ప్రస్తుత రాజకీయ పరిణామాలు" అనే అంశంపై రాజకీయ తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థపై అమెరికా సామ్రాజ్యవాద విధానాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ప్రపంచంలోని చమురు సంపద కలిగిన దేశాలపై ఆధిపత్యం సాధించడం, తమ ప్రయోజనాలకు అనుకూలంగా లేని ప్రభుత్వాలపై రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు తీసుకురావడం అమెరికా విధానంగా మారిందని పేర్కొన్నారు. అమెరికా విధానాలకు అనుగుణంగా భారత ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తలొగ్గారని ఆయన విమర్శించారు. ఈ విధానాల ప్రభావంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతులు–కార్మికులపై పెరుగుతున్న భారం వంటి పరిణామాలు ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చుతున్నాయని అన్నారు. దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడే స్వతంత్ర ఆర్థిక విధానాలను అమలు చేయాలని, ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పరిరక్షించేందుకు వామపక్ష శక్తులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.విద్యా,వైద్యాన్ని గాలికొదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ అన్నారు. సిపిఎం రామన్నపేట మండల రాజకీయ శిక్షణా తరగతుల రెండవ రోజు నిర్వహించిన సమావేశంలో ఆయన "రాష్ట్ర రాజకీయ పరిస్థితులు–ప్రజా సమస్యలు" అనే అంశంపై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలపై తగిన శ్రద్ధ, నిధులు, సిబ్బంది నియామకాలు లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించిన సర్వేలో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయులు, వైద్యులు, సిబ్బంది ఖాళీలు, తాగునీరు, మరుగుదొడ్లు, మందులు, వైద్య పరికరాల కొరత వంటి అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని నియమించడం, అన్ని రకాల వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని



డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమానికి విద్య, వైద్యం పునాది రంగాలని, వాటిని బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ రాజకీయ శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్ గా బొడ్డుపల్లి వెంకటేశం వ్యవగారించిగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నర్సింహా చారి, బోయిని ఆనంద్, కందుల హనుమతు, కల్లూరి నగేష్, జంపాల అండాలు, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు, గన్నెబోయిని విజయభాస్కర్,నాగటి ఉపేందర్, ఎండీ రషీద్, బావండ్లపల్లి బాలరాజు,ఆవనగంటి నగేష్,తోలుపునూరి శ్రీనివాస్, మేడి గణేష్, కార్యదర్శులు అంబటి మల్లారెడ్డి,మునికుంట్ల లెనిన్, పులి బిక్షం,అవనగంటి రవీందర్,గంగాదేవి మల్లేష్, అప్పం సురేందర్, మెట్టు శ్రవణ్ కుమార్,మేడి ముకుంద, పుట్టల ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే వెంకటేశ్వర్లు.

**మోత్కూర్, ఆగష్టు 02,వెలుతురు న్యూస్ :**

వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వినియోగదారుల సంఘం కార్యకర్తలు కృషి చేయాలని క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం నాడు భువనగిరి పట్టణ కేంద్రంలోని ఎస్వీ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం నూతన జిల్లా కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా పోచం సోమయ్య, ఉపాధ్యక్షులుగా దేవి నిగూడెపు బాబు, ఎలిమినేటి నగేష్, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి యాదగిరి, సహాయ కార్యదర్శిగా ఆవుల సురేందర్, ప్రచార కార్యదర్శిగా కందుకూరి శ్రీనివాస్, కోశాధికారిగా పి భార్గవి, కార్యవర్గ సభ్యులుగా నోముల వెంకటేశం, గుడారి కళ్యాణి, ఎర్ర శివరాజు, నీరటి పురుషోత్తం, మందుల అవిలయ్య,జిల్లా వినియో



గదారుల సమాచార కేంద్రం కన్వీనర్ గా గుడారి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈల వెంకటేశ్వర్లు సహాయ ఎన్నికల అధికారిగా క్యాట్కో రాష్ట్ర సహాయ కార్యదర్శి అన్యబోయిన మట్టయ్య వ్యవహరించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు.

## చింతకుంట మడేలేశ్వర స్వామి దేవాలయంలో నూతన బోర్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 02:**

కరీంనగర్ నగరంలోని చింతకుంట మడేలేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌ను నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడేలా ఈ బోర్ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీ గడ్డి ప్రదీప్, గాజ శివరాం రాచకొండ కిట్టు , భూక్య తిరుపతి నాయక్ , గంగాధర శ్రీనివాస్ ,రాచకొండ కొమురయ్య, పూసల సంపత్ ,జుట్ట వేణి రేణు, గుంజేటి శివకుమార్, రాచకొండ శ్రీనివాస్ ,రజక సంఘం నాయకులు మరియు కులస్తులు పాల్గొన్నారు

## ఖేడ్లో ఘనంగా ఫ్రెండ్షిప్ డే వేడుకలు

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 02 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్–17 నారీ సెల్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం శ్రీ సత్యసాయి మందిరంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ శాసనసభ్యులు గారి సతీమణి శ్రీమతి అనుపమ సంజీవ్ రెడ్డి గారు విచ్చేసి ఆమె డాక్టర్స్ మరియు ఇంపాక్ట్ నారీ సెల్ సభ్యులు కలసి కేక్ కట్ చేసి స్నేహితుల దినోత్సవాన్ని ప్రారంభించడంతో పాటు, కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ స్వయంగా ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీమతి అనుపమ సంజీవ్ రెడ్డి గారు మాట్లాడుతూ, "స్నేహం అనేది మన జీవితంలో అమూల్యమైన బంధం. ప్రేమ, పరస్పర గౌరవం, నమ్మకం, సహకారం ఉన్నచోటే నిజమైన స్నేహం ఉంటుంది. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయి" అని పేర్కొన్నారు. నారీ సెల్ సభ్యులు మాట్లాడుతూ, మహిళల మధ్య స్నేహభావం, పరస్పర సహకారం మరియు సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ వేడుకలో ఇంపాక్ట్ నారీ సెల్ డైరెక్టర్ మధుర, రీజినల్ సెక్రటరీ శ్వేత, జాయింట్ సెక్రటరీ కరుణ దేశ్ముక్, లావణ్య ఐసీఐ సభ్యులు ,మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.





## ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు అడిగితే "క్రిమినల్ వేస్ట్" అంటారా సీఎం రేవంత్ రెడ్డి గారూ?

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 02:** రాష్ట్రంలోని 30 లక్షల మంది విద్యార్థులు తమకు రావాల్సిన ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తే వారిని "క్రిమినల్ వేస్ట్"గా అభివర్ణించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి, విద్యార్థుల పట్ల ఆయనకున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం రోజున కరీంనగర్లో ప్రవీణ్ రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ హక్కులను అడిగితే అవమానించడం కాదు... వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థులనే నిందించే స్థాయికి దిగజారిందని విమర్శించారు.రెండున్నరేళ్లుగా విద్యాశాఖ మీ దగ్గరే ఉంది. ఈ కాలంలో విద్యా నాణ్యతను పెంచేందుకు తీసుకున్న ఒక్క సంస్కరణను అయినా చెప్పగలరా? ప్రభుత్వ పాఠశాల లుబలోపేతమయ్యాయా? విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ అయ్యాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించారా? స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందాయా? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారా? అని ప్రశ్నించారు.సమస్యలను పరిష్కరించలేక, ప్రశ్నించే విద్యార్థులనే "క్రిమినల్ వేస్ట్"గా ముద్ర వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. తెలంగాణ యువతను అవమానించే



హక్కు ముఖ్యమంత్రికి లేదని స్పష్టం చేశారు.తక్షణమే "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## 24వ డివిజన్‌లో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 02:**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 24వ డివిజన్‌లోని గుండు హనుమాన్ టెంపుల్ సమీపంలో రూ.50 లక్షల UIDF నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు గౌరవ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారు, నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. నగర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి గారు, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి గారు, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత వై.నరోత్తం

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు, 02:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించిన బోనాల మహోత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెలంగాణ ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ సందర్భంగా వై. నరోత్తం మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఈ పండుగను ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జహీరాబాద్‌లో ఘనంగా ఊరడమ్మ దేవతకు బోనాలు



- **బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి, మహ్మద్ తన్వీర్...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆదివారం ఊరడమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. గడి వీధి, మాణిక్ ప్రభు వీధి, గాంధీనగర్, హమాలీ కాలనీల్లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి, మాజీ టీజీఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, మంచి వర్షాలు కురిసి రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి, మహ్మద్ తన్వీర్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.బోనాల సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించగా, సాంప్రదాయ కళారూపాలు, భక్తుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యునూస్, సీడీసీ చైర్మన్ ముబీన్, ఆత్మ కమిటీ చైర్మన్ రాంలింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## 9. బోనాల వేడుకల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 02:**

కరీంనగర్ నగరంలోని కిసాన్ నగర్, శ్రీపురం కాలనీ, చింతకుంట, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా దేవాలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బోనమెత్తి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, ఏపీపీ చంద్ర, సోమిడి వేణు, గాదె రూప, విప్పల సాయి జ్యోతి, గాజ రమ శివరాం, బారి అపర్ణ జితేందర్, ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు నెలలు గడిచినా పురోగతి సాధించని జోగు సంగీత కేసు

- **హత్యను సాధారణ మృతిగా చిత్రీకరించారనే ఆరోపణ బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం**
- **జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి: నవోదయ సిద్ధార్థ**

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 2:**

జోగు సంగీత హత్య కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం కంగ్టి మండలం దెగులువాడి గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, జోగు సంగీత హత్య జరిగినప్పటికీ కేసు నమోదులో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రతిసారి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ..బాధిత కుటుంబం హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో వారి వినతిపై దెగులువాడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు.జోగు సంగీత భర్త జోగు విజయ్ మే 27న ఆమె కనిపించడం లేదని కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని ఆయన ఆరోపించారు. అనంతరం మే 29న గ్రామ శివారులో జోగు సంగీత (26) మృతదేహం ఎడమ చేయి లేకుండా లభించిందని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ ఆ నివేదికను కుటుంబ సభ్యులకు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు.రెండు నెలలు గడిచినా కేసులో గణనీయమైన పురోగతి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, బాధిత కుటుంబం న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే వారిని భయపెట్టడం బాధాకరమని విమర్శించారు. చట్టం అందరికీ సమానమని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ సంస్థ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.చివరగా జోగు సంగీత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నవోదయ సిద్ధార్థ నేతృత్వంలోని బృందం కంగ్టి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై దుర్గారెడ్డిని కలిసి జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి, నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఓంప్రకాష్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్ , సంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గాల్‌రెడ్డి, డాక్టర్ బాబురావు, సాయిలు, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. ఖైసర్, సంతోష్‌రావు పాటిల్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బహుజన ప్రసాద్, సంస్థ నాయకులు సురేష్ గౌడ్, గ్రామస్తులు విశ్వనాథ్, శంకర్ , భీమప్ప ప్రకాష్ , బాధితులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.






## ఆర్యకటిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆర్యకటిక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యకటిక సంఘం మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించేందుకు ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు.డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, అమ్మవారి విగ్రహంతో పాటు యువత సందడితో ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారు ప్రజలను చల్లగా చూడాలని, భక్తుల కోరికలను నెరవేర్చాలని కోరుతూ బోనాలు సమర్పిస్తున్నట్లు ఆర్యకటిక సంఘం అధ్యక్షుడు మొగ్లాజి రాజు తెలిపారు. అమ్మవారి కృప, ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మొగ్లాజి రాజు మాట్లాడుతూ.. సంఘంలోని అందరూ ఐకమత్యంతో కలిసి బోనాల పండుగను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్యకటిక సంఘం సభ్యులతో పాటు ఆర్యకటిక యువజన సంఘం ప్రతినిధులు గొడకే మహేందర్, గొడకే వంశీ, రమేష్, కటికి ఆనంద్, కృష్ణ, రాజ్‌కుమార్, నాగరాణి పాల్గొన్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

## వాడగూడెం ఇసుక ర్యాంప్‌లో అక్రమ వసూళ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలి

- వాడగూడెం ఇసుక ర్యాంప్ కాంట్రాక్టు రద్దు చేయాలి.
- టీజీఎండీసీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?
- అక్రమ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నది ఎవరు?
- అక్రమ వసూళ్లను అరికట్టాలని పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

ములుగు జిల్లా వాడగూడెం ఇసుక ర్యాంప్‌లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు డీడీ 15650/- చెల్లించిన అనంతరం కూడా, లోడింగ్ పేరుతో ఒక్కో ఇసుక లారీ నుంచి రూ.3,500 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.ఫిర్యాదుల ప్రకారం, ప్రతిరోజూ వందలాది ఇసుక లారీలు ఈ ర్యాంప్ నుంచి లోడింగ్ అవుతుండటంతో రోజుకు లక్షల రూపాయల అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని సమాచారం అందుతోంది. ఈ పరిస్థితి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడమే కాకుండా, ప్రభుత్వ ప్రతిష్ఠకు కూడా భంగం కలిగించే అవకాశం ఉందని లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం మరియు టీజీఎండీసీ ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు నిర్ధారితమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది.అదేవిధంగా, అక్రమ వసూళ్లను పూర్తిగా అరికట్టి, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం పారదర్శకమైన ఇసుక లోడింగ్ వ్యవస్థను అమలు చేసి, లారీ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ కోరుతోంది.ఈ వ్యవహారంపై టీజీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) గారు వ్యక్తిగతంగా స్పందించి, వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసి, వాస్తవాలు నిర్ధారితమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద అంబర్‌పేట్



ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోంది.లేని పక్షంలో, బాధిత లారీ యజమానులతో కలిసి ప్రజాస్వామ్య బద్ధంగా టీజీఎండీసీ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించాల్సి వస్తుందని, ఆందోళనకు పూర్తి బాధ్యత సంబంధిత అధికారులు , టీజీఎండీసీ సంస్థదేనని పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరిస్తోంది.

## త్రి మీట్ & రెడ్డి గారి బిర్యానీ గ్రాండ్ ప్రారంభోత్సవం

**ఎల్బీనగర్ వెలుతురు ఆగస్టు2 :**

ఎఫ్సీఐ కాలనీ వనస్థలిపురంలో నాణ్యమైన మాంసం మరియు రుచికరమైన బిర్యానీని ప్రజలకు అందించేందుకు మాంసాహార దుకాణం , రెడ్డి గారి బిర్యానీ దుకాణాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుకాణం వద్ద ప్రారంభోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. యజమాని అల్లా నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నడిచే ఈ దుకాణంలో చేపలు, రొయ్యలు, మేక మాంసం, నాటు కోడి, బాయిలర్ కోడి తదితర మాంసాహార ఉత్పత్తులు లభిస్తాయి. టోకు మరియు చిల్లర రెండు రకాల అమ్మకాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు తాజా సరుకు, శుభ్రంగా ప్రాసెస్ చేయబడిన, నాణ్యమైన ఉత్పత్తులు అందించడమే తమ లక్ష్యమని నరేంద్ర కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వినియోగదారులకు ఇంటి వద్దకే ఉచిత సరఫరా సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు.








### లష్కర్ బోనాల సందడి..

## ఉజ్జయిని మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న వేలాది మంది భక్తులు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆలయంలో ప్రత్యేక క్యూ లైన్లు, భక్తులకు విస్తృత ఏర్పాట్లు
- రెండు రోజుల పాటు బోనాల జాతర.. సోమవారం రంగం భవిష్యవాణి
- 2,500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు
- హెల్త్ క్యాంపులు, వాటర్ క్యాంపులు, అంబులెన్స్‌ల ఏర్పాటు
- బోనాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు మంత్రి వెల్లడి

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 2:**



భాగ్యనగరంలో లష్కర్ బోనాల వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చారు. దాదాపు 200 ఏళ్ల చరిత్ర కలిగిన మహంకాళి ఆలయం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి.తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. సాధారణ భక్తుల కోసం మూడు క్యూ లైన్లు, బోనాలు సమర్పించే భక్తుల కోసం రెండు ప్రత్యేక క్యూ లైన్లను అధికారులు ఏర్పాటు చేశారు.ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు బోనాల జాతర కొనసాగనుంది. సోమవారం అమ్మవారి రంగం భవిష్యవాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే ఆదివారం, సోమవారం రాత్రి అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు జరగనుంది. శివసత్తుల దర్శనాల కోసం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ప్రత్యేక సమయం కేటాయించారు.లక్షలాది మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో 2,500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. భక్తుల కోసం ప్రత్యేక వాటర్ క్యాంపులు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలను కూడా అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ దంపతులు కూడా ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

## చిట్టీల పేరుతో రూ.5 కోట్ల మోసం?.. కుటుంబంతో పరారైన దంపతులు

- రంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన భారీ చిట్‌ఫండ్ మోసం
- డబ్బులు వసూలు చేసి రాత్రికి రాత్రే పరారైన కుటుంబం
- రూ.5 కోట్లకు పైగా మోసం జరిగిందని బాధితుల ఆరోపణ

**రంగారెడ్డి, వెలుతురు, ఆగస్టు 2:**

రంగారెడ్డి జిల్లాలో చిట్టీల పేరుతో భారీ మోసం వెలుగుచూసింది. రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో చిట్టీలు నిర్వహిస్తూ పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన దంపతులు కుటుంబంతో కలిసి పరారైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు.బాధితుల కథనం ప్రకారం, అశోక్ అనే వ్యక్తి చిట్టీల పేరుతో ప్రజల నుంచి భారీగా నగదు సేకరించాడు. శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పరారైనట్లు వారు చెబుతున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.5 కోట్ల మేర మోసం జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు నిందితుడి ఇంటి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. అశోక్‌ను వెంటనే అరెస్టు చేసి తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని పోలీసులను కోరారు.

సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చారు. నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అయితే రూ.5 కోట్ల మోసం జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నప్పటికీ, ఆ మొత్తాన్ని పోలీసులు అధికారికంగా ఇంకా నిర్ధారించలేదు.

## రాష్ట్రంలోని ఖాళీ ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలి

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేణు కుమార్ ఉద్యోగ నోటిఫికేషన్లు రావడం లేదని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించడం చాలా బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తునారనీ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. నోటిఫికేషన్ల కోసం ఎదురు చూసి చూసి యువత నైరాశ్యం లోకి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయానా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి చెందిన వేణు కుమార్ అనే నిరుద్యోగ యువకుడు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల



కాకపోవడం,ఉద్యోగావకాశాలు లేక తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్యంత బాధాకరమ ని అనరు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ సమగ్ర ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని,నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ లింగం గౌడ్ డిమాండ్ చేశారు.

## మునుగోడులో కంటి విప్లవం

- 15 ఉచిత కంటి వైద్య శిబిరాలు, 11654 మందికి కంటి పరీక్షలు, 2490 మందికి కంటి ఆపరేషన్లు, 5272 మందికి కండ్లజోళ్ల పంపిణీ
- ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా నిరుపేద వృద్ధుల కండ్లలో వెలుగులు నింపుతున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు వెలుతురు ఆగస్టు 02:**





మునుగోడు నియోజకవర్గంలో కంటి విప్లవం కొనసాగుతోంది..నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధపడొద్దని, ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చేయించి నాణ్యమైన చూపును అందించాలనే ముందుచూపుతో తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు.. దాంట్లో భాగంగానే ఈరోజు 2-8-2026, ఆదివారం 16 వ, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మునుగోడు లోని క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించారు...కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మునుగోడు నియోజకవర్గ ముఖ్యనాయకులు ఈ 16వ, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంబించారు.ఇప్పటివరకు 15 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 11654 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2490 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి 5272 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు.. మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, 2వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన 3వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన 4వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన 5వ, విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చూందురు మండల ప్రజలకు చండూరు మండలం బంగారి గడ్డలో నిర్వహించిన 6వ, విడత వైద్యశిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో ఘట్టుప్పల్ మండల ప్రజలకు నిర్వహించిన 7వ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండలంలో నిర్వహించిన 8 వ, విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన 9వ, విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన 10వ, విడత వైద్య శిబిరంలో 160 మందికి, మునుగోడు లో మునుగోడు, ఘట్టుప్పల్ మండలాల ప్రజలకు నిర్వహించిన 11వ, విడత వైద్య శిబిరంలో 257 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయం ఆవరణలో చూండరు మున్సిపాలిటీ చండూరు మండల ప్రజలకు నిర్వహించిన 12 వ, విడత వైద్య శిబిరంలో 223 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో నాంపల్లి మండల ప్రజలకు నిర్వహించిన 13 వ, వైద్య శిబిరంలో 228 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో మర్రిగూడ మండల ప్రజలకు నిర్వహించిన 14వ విడత వైద్య శిబిరంలో 127 మందికి, చౌటుప్పల్ లో చౌటుప్పల్ మండల, పట్టణ ప్రజలకు నిర్వహించిన 15 విడత వైద్య శిబిరంలో 1210 మందికి కంటి పరీక్షలు జరిపి 165 మందికి కంటి ఆపరేషన్లను పూర్తి చేశారు.... మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు... రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు.. దాంట్లో భాగంగానే ఈరోజు (2-8-2026) న 16వ. విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు..ఈ శిబిరంలో 415 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 157 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు..ఆపరేషన్లకు ఎంపికైన వారి హైదరాబాద్ నానక్ రాంగూడ లోని శంకరా కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్సకు పంపించారు.. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు..



## ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా భక్తులకు ప్రత్యేక వైద్య సేవలు



- జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్.

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్ జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. పుట్ల శ్రీనివాస్ తెలిపారు.ఆయన ఆదేశాల మేరకు బోనాల ఉత్సవ ప్రాంతాల్లో 5 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన మందులు, అత్యవసర వైద్య పరికరాలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు 2 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ALS) అంబులెన్సులు మరియు 3 బేసిక్ లైఫ్ సపోర్ట్ (BLS) అంబులెన్సులు సేవలకు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్ వైద్య శిబిరాలను పరిశీలించి, భక్తులకు నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ డా. ఆశ్రిత గారు, వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది , ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.అస్వస్థతకు గురైన భక్తులు సమీపంలోని వైద్య శిబిరాన్ని సంప్రదించి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్ కోరారు.



## ఆటా 19వ మహాసభల్లో ప్రముఖ న్యాయవాది నాగేశ్వరరావు పూజారికు ఘన సత్కారం

**అమెరికా, వెలుతురు ఆగస్టు 02:**



అమెరికాలోని బాల్టిమోర్ వేదికగా అంగరంగ వైభవంగా జరుగుతున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 19వ మహాసభల్లో ప్రముఖ న్యాయవాది నాగేశ్వరరావు పూజారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకుల నుంచి అరుదైన గౌరవం దక్కింది. న్యాయ, సామాజిక రంగాల్లో ఆయన అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా 'ఆట' ప్రతినిధులు ఆయనను వేదికపై ఘనంగా సత్కరించారు.అమెరికా నలుమూలల నుంచి విచ్చేసిన పలువురు ప్రవాస భారతీయులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖుల సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆయనను నిర్వాహకులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు పూజారి మాట్లాడుతూ .. ఖండాంతరాల్లో ఉన్నా మాతృభూమిపై ప్రేమతో తెలుగువారిని ఏకం చేస్తూ, మన భాషా సంస్కృతులను దశదిశలా చాటుతున్న 'ఆటా' చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తనను గుర్తించి ఇంతటి గౌరవం అందించిన అమెరికన్ తెలుగు సంఘం కార్యవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాలో ఉంటున్న తెలుగు వారందరికీ అవసరమైన న్యాయ సలహాలు ఇవ్వడంతో పాటు, ఇమిగ్రేషన్, కుటుంబ సమస్యలకు సంబంధించి తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నానని నాగేశ్వరరావు పూజారి తెలిపారు. ప్రవాస భారతీయులలో అతిపెద్ద తెలుగు వేదికల్లో ఒకటైన ఆటా, తన సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా రెండు రాష్ట్రాల అభివృద్ధికి కూడా దోహదపడుతోందని అన్నారు.



## ఇరాన్‌పై దాడులకు ట్రంప్ బ్రేక్ ఒప్పందానికి మరో అవకాశం

- ఇరాన్‌పై సైనిక దాడి ప్రణాళికలను నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- హర్మూజ్ జలసంధి తెరవడం, అణు ఒప్పందంపై చర్చలకు మరింత సమయం

**వాషింగ్టన్, వెలుతురు, ఆగస్టు 2:**

ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై ప్రణాళికాబద్ధంగా చేపట్టాల్సిన సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు ముప్పును అంతం చేసే ప్రతిపాదిత ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు మరింత సమయం కావాలని ఇరాన్‌తో పాటు పలు పశ్చిమాసియా దేశాలు కోరినట్లు తెలిపారు. ఒప్పందం త్వరగా కుదిరితేనే అమెరికా దాడుల విరామం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ట్రూత్ సోషల్‌లో ట్రంప్ చేసిన పోస్టు ప్రకారం.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ చూడని స్థాయిలో సైనిక శక్తితో ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందన్నారు. అయితే ప్రపంచ ప్రయోజనాలు, ఇరాన్ మనుగడను దృష్టిలో పెట్టుకుని దాడులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఒప్పందంలోని ప్రధాన అంశాలపై ఒక అవగాహన ఏర్పడిందని, అందుకే ఇరాన్‌తో పాటు గల్ఫ్ దేశాలు దాడులను నిలిపివేయాలని కోరినట్లు వెల్లడించారు. యుద్ధానికి ముగింపు పలికి ఇరాన్‌తో ఒప్పందం చేసుకునేందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా



అంగీకరించారని ట్రంప్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించిన అంశాలపై ఖతార్, పాకిస్థాన్‌లు విడివిడిగా అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఈ చర్చలపై సంబంధిత దేశాల నుంచి పూర్తి స్థాయి అధికారిక వివరాలు ఇంకా వెలువడలేదు.

## వర్ష బీభత్సం.. కొండచరియలు విరిగి ఒకే కుటుంబం మృతి

- కర్ణాటకలో భారీ వర్షాలకు ఘోర విషాదం
- శివమొగ్గ జిల్లాలో కొండచరియలు విరిగి ముగ్గురు మృతి
- మృతుల్లో మూడేళ్ల చిన్నారి కూడా
- నిద్రలో ఉండగానే రేకుల షెడ్డుపై కూలిన మట్టి, రాళ్లు
- పక్కనే ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- శిథిలాల నుంచి మృతదేహాలను వెలికి తీసిన సహాయక బృందాలు
- ఘటనపై పోలీసులు దర్యాప్తు

**శివమొగ్గ, వెలుతురు, ఆగస్టు 2:**



కర్ణాటకలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు విషాదాన్ని మిగిల్చాయి. శివమొగ్గ జిల్లా ఇందిరానగర్‌లో ఆదివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో మూడేళ్ల చిన్నారి ఉండటం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.పోలీసుల వివరాల ప్రకారం, కొప్పల్ జిల్లా గంగావతి తాలుకా కొక్కరెగర గ్రామానికి చెందిన మల్లికార్జున్ (35), ఆయన భార్య నాగవేణి (28), కుమారుడు సంతోశ్ (3) ఇందిరానగర్‌లోని ఓ రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి వారి నివాసంపై కూలిపోయాయి. దీంతో ముగ్గురూ నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు.అదే సమయంలో పక్కనే ఉన్న మరో షెడ్డుపై కూడా మట్టి, రాళ్లు పడటంతో అందులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది, అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వ్యక్తిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.అనంతరం శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికితీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మల్నాడు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన విషయాన్ని పోలీసులు ధ్రువీకరించారు.

## పోలీస్ వేషంలో అల్లర్ల కుట్ర

- బెంగాల్‌లో జైషే ఉగ్ర నెట్‌వర్క్ బట్టబయలు
- జైషే ఉగ్రసంస్థతో సంబంధాలున్న హమీమ్, ప్రియురాలు అరెస్ట్
- జంతర్‌మంతర్‌లో అల్లర్లు సృష్టించాలన్న పాక్ హ్యాండ్లర్ల ఆదేశాలు
- పోలీసు యూనిఫామ్‌లో నిరసనల్లో చొరబడాలని ప్లాన్
- రాజకీయ నేతలపై నిఘా కోసం హనీట్రాప్ వల
- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. నాలుగేళ్లుగా కలిసి కార్యకలాపాలు

**న్యూఢిల్లీ/కోల్‌కతా, వెలుతురు, ఆగస్టు 2:**

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో సంబంధాలున్న హమీమ్ మోండల్, అతడికి సహకరించిన ఝార్ఖండ్‌కు చెందిన అర్పిత సర్కార్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దర్యాప్తులో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు సృష్టించడం, రాజకీయ నేతలపై నిఘా పెట్టడం, హనీట్రాప్ ద్వారా సమాచారం సేకరించడం వంటి కుట్రలు వెలుగులోకి వచ్చినట్లు స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు వెల్లడించారు.ర్యాప్తు ప్రకారం, జైషే హ్యాండ్లర్లు హమీమ్‌కు పోలీసు యూనిఫామ్ ధరించి జంతర్‌మం తర్ నిరసన ప్రదేశంలోకి ప్రవేశించి అల్లర్లు సృష్టించాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం మహిళలు, పురుషులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని కూడా సూచించి నట్లు వెల్లడించారు. నిందితులు నిజంగా అక్కడికి వెళ్లారా లేదా అనే అంశంపై వారి చాట్‌లు, డిజిటల్ ఆధా రాలను పరిశీలిస్తున్నారు.రాజకీయ నేతల కదలికలపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా భద్రత తక్కువగా ఉండే సందర్భాలపై సమాచారం సేకరించాలని పాక్ హ్యాండ్లర్లు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ సమాచారాన్ని ఏ లక్ష్యంతో వినియోగించాలనుకున్నారన్న కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.అర్పిత సర్కార్ హమీమ్‌కు నాలుగేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, తర్వాత అతడికి సహకరిస్తూ రాజకీయ నేతలతో పరిచయాలు పెంచుకునే పనిలో పాల్గొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. చిన్నస్థాయి నాయకుల ద్వారా ప్రముఖ రాజకీయ నేతలకు చేరువ కావడం, తమ వ్యక్తులను రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా చేర్పించడం వంటి కార్యకలాపాల్లో ఆమెను వినియోగించుకున్నట్లు తెలిపారు.దర్యాప్తులో భాగంగా ఒక రాష్ట్ర మంత్రికి చెందిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్, కిడ్నాప్ కుట్ర కూడా పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పలువురు రాజకీయ నాయకులతో అర్పితకు ఉన్న పరిచయాల ద్వారా సేకరించిన సమాచారాన్ని హమీమ్‌కు చేరవేసినట్లు అధికారులు వెల్లడించారు.ఇద్దరూ కొన్నేళ్లుగా ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో సంప్రదింపులు కొనసాగించినట్లు దర్యాప్తులో తేలింది. వారి వద్ద యూకే, మెక్సికోలకు చెందిన అంతర్జాతీయ సిమ్‌కార్డులు కూడా లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. తీవ్రవాద భావజాల ప్రచారం, ఉగ్రవాద నియామకాలు వంటి కార్యకలాపాల్లో కూడా వీరిని ఉపయోగించుకున్నట్లు అనుమానిస్తూ దర్యాప్తును మరింత విస్తరించారు.



## రెంటల్ కారుతో బీభత్సం సృష్టించిన మైనర్ బాలుడు.. ఒకరు మృతి.. కేసు నమోదు

**జూబ్లీహిల్స్ వెలుతురు, ఆగస్టు 2:**

రోడ్డు భద్రత కోసం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఎన్నిసార్లు ప్రకటించినా, ప్రజలు మాత్రం వాటిని సర్వసాధారణం అనుకుంటూ వదిలేస్తున్నారు. పోలీసులు ఎన్ని కఠిన చర్యలు చేపట్టినా మాకు సంబంధం లేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదే కోవలో ఆదివారం బోరబండలో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఓ మైనర్ బాలుడు నడుపుతున్న కారు అదుపుతప్పి వాహనాలపైకి దూసుకెళ్లింది. ఆ కారును మైనర్ బాలుడు నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మైనర్ బాలుడు (17) యూసఫ్‌గూడలోని ఓ రెంటల్ కారు అద్దెకు తీసుకుని, స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేద్దామని అవగాహనలేని డ్రైవింగ్ చేస్తూ రహమత్‌నగర్‌లో ఓ ఇంటి ముందు ఈ ప్రమాదానికి కారణమయ్యాడు. వేగంగా వచ్చిన కారు ఇంటి గేటును ఢీకొని, పక్కనే నిలిచి ఉన్న ఇద్దరు వ్యక్తులపైకి దూసుకెళ్లింది. ఈ



ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు రాజ్‌కుమార్ (60), ప్రభాకర్ (55) తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఏడు బైకులు ధ్వంసమయ్యాయి. గాయపడిన అన్నదమ్ముల్లో ప్రభాకర్ (55) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో మైనర్ బాలుడి(17)పై, అతనికి కారు ఇచ్చిన రెంటల్ కారు సంస్థ యజమానిపై, అలాగే ప్రేరేపించిన ఇతరులపై కూడా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## రెండు తెలుగు రాష్ట్రాల శ్రేయస్సు కోసం శ్రీశైలం, తాడ్‌బండ్‌లో ప్రత్యేక పూజలు: భీమ లక్ష్మణ్ ముదిరాజ్

**వెలుతురు హైదరాబాద్/ శ్రీశైలం, ఆగస్టు 2:**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ ఆదివారం రోజున పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దివ్య సన్నిధిలో అత్యంత భక్తిశ్రద్ధలతో స్పర్శ దర్శనం చేసుకొని, వేద పండితులచే వేద ఆశీర్వచనం స్వీకరించారు.ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ధర్మం, న్యాయం, శాంతి సమాజంలో విలసిల్లాలని, ప్రతి కుటుంబం సర్వతోముఖాభివృద్ధిని సాధించాలని పరమేశ్వరుడిని, జగన్మాత శ్రీ భ్రమరాంబిక అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ తాడ్‌బండ్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దివ్య సన్నిధిలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధైర్యం, భక్తి, విశ్వాసానికి ప్రతీక అయిన శ్రీ ఆంజనేయ స్వామి వారి అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మరింత సుభిక్షంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని



మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి, సామరస్యం, ప్రజాసంక్షేమం మరింత వృద్ధి చెందాలని, ప్రతి ఇంట సుఖ సంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.

## పెరూలో ఘోర విమాన ప్రమాదం

- నాజ్కా లైన్స్ పర్యాటకులు దుర్మరణం
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం
- వేగంగా భూమికి దూసుకొచ్చి మంటల్లో కాలిబూడిద
- పిస్కో విమానాశ్రయం నుంచి ప్రయాణం
- కంట్రోల్ టవర్‌తో తెగిపోయిన సంకేతాలు
- విదేశీ పర్యాటకులే బాధితులు
- 13 మంది ఇటలీ, జర్మనీ, స్పెయిన్ పౌరుల దుర్మరణం

**పిస్కో (పెరూ), వెలుతురు, ఆగస్టు 2:**

దక్షిణ అమెరికా దేశమైన పెరూలో ఘోర విమాన ప్రమాదం సంభవించి తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పురావస్తు వింత 'నాజ్కా లైన్స్' ప్రాంతాన్ని ఆకాశ మార్గం నుంచి వీక్షించేందుకు వెళ్లిన ఒక చిన్న పర్యాటక విమానం హఠాత్తుగా కుప్పకూలింది. ఈ దారుణ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 11 మంది విదేశీ పర్యాటకులతో పాటు ఇద్దరు విమాన సిబ్బంది (క్రూ మెంబర్లు) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర సంఘటనను పెరూ రవాణా మంత్రిత్వ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. పర్యాటకులను తీసుకెళ్తున్న విమానం గాల్లోకి లేచిన కొద్దిసేపటికే అదుపుతప్పి నేలకూలడంతో ఈ ఘోరం జరిగింది.'అయేరో డయానా' అనే విమానయాన సంస్థకు చెందిన 'సెస్నా 208 గ్రాండ్ కారవాన్' రకానికి చెందిన చిన్న పర్యాటక విమానం మధ్యాహ్నం 1:00 గంటల ప్రాంతంలో పిస్కో విమానాశ్రయం నుంచి నాజ్కా లైన్స్ వైపు బయలుదేరింది. ఈ విమానాశ్రయం పెరూ రాజధాని లిమాకు దక్షిణ దిశలో సుమారు 240 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రయాణం ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే విమానం కంట్రోల్ టవర్‌తో తన అనుసంధాన సంకేతాలను కోల్పోయింది. నాజ్కా నగరానికి సమీపంలోని 'విస్టా అలెగ్రే', 'ప్యూబ్లో వియోహో' ప్రాంతాల మధ్య విమానానికి గాల్లోనే తీవ్రమైన సాంకేతిక లోపం తలెత్తినట్లు అధికారులు గుర్తించారు. సాంకేతిక సమస్యల కారణంగా పైలట్ నియంత్రణ కోల్పోవడంతో విమానం ఒక్కసారిగా భయంకరమైన వేగంతో భూమి వైపు దూసుకొచ్చి పడిపోయింది. విమానం తీవ్ర వేగంతో నేలను ఢీకొట్టిన మరుక్షణమే భారీ శబ్దంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే విమానం ముద్దగా మారి కాలిబూడిదవ్వడంతో అందులోని ప్రయాణికులు బయటపడేందుకు లేదా ప్రాణాలు దక్కించుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది.ఈ ప్రమాదంలో మరణించిన 11 మంది విదేశీ పర్యాటకులు ఐరోపా ఖండంలోని వివిధ దేశాలకు చెందినవారిగా అధికారులు ధ్రువీకరించారు. వీరిలో ఏడుగురు ఇటలీ పౌరులు, ఇద్దరు జర్మనీ పౌరులు కాగా, మరొక ఇద్దరు స్పెయిన్ దేశానికి చెందిన ప్రయాణికులు ఉన్నారు. వీరందరితో పాటు విమానాన్ని నడుపుతున్న అనుభవజ్ఞుడైన పైలట్ అమెరికో సలాజార్ క్యూఎల్లార్, కో-పైలట్ ఐరెంకా డెల్



కార్పియోలు కూడా ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మరణించారు.ప్రమాద వార్త తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, అత్యవసర అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎడారి ఇసుక దిబ్బల మధ్య విమానం తీవ్రంగా ధ్వంసమై శకలాలు ఎక్కడపడితే అక్కడ పడిపోయాయి. ప్రమాద తీవ్రత కారణంగా విమానం రెక్కలు, చక్రాల భాగాలు ప్రధాన భాగం నుంచి ఊడిపోయి దూరంగా పడ్డాయి. ఇంకా పొగలు వస్తున్న విమాన శకలాల నుంచి మృతదేహాలను బయటకు తీసేందుకు రక్షణ బృందాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.ఈ ఘోర విమాన ప్రమాదంపై పెరూ పర్యాటక మంత్రిత్వ శాఖ తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేసింది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, దర్యాప్తు ప్రక్రియ సజావుగా సాగేందుకు పిస్కో విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.విమాన ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు పెరూ సివిల్ ఏవియేషన్ అథారిటీ, ఎయిర్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాయి. ప్రత్యేక విచారణ బృందాలు ఘటనా స్థలంలో పడివున్న విమాన భాగాలు, డేటా ఆధారాలను సేకరిస్తు న్నాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత ప్రమాదానికి గల పూర్తి వివరాలను వెల్లడిస్తామని 'అయేరో డయానా' సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేశారు.కాగా నా జ్కా లైన్స్ పరిసర ప్రాంతాల్లో పర్యాటక విమానాలు ప్రమాదానికి గురికావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇక్కడ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2022లో ఒక చిన్న విమానం కూలి ఏడుగురు మరణించగా, 2010 అక్టోబరులో 'ఎయిర్ నాజ్కా' విమానం కూలి నలుగురు బ్రిటీష్ పర్యాటకులు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 2010 ప్రారంభంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు, 2008లో ఐదుగురు ఫ్రెంచ్ పర్యాటకులు మరణించారు. పదేపదే విమాన ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ ప్రాంతంలో నడిచే విమానాల ఫిట్‌నెస్, భద్రతా తనిఖీలను మరింత కఠినతరం చేయాలని పర్యాటకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


# నటనకు ఆస్కారం ఉన్న పాత్రలనే ఎంచుకుంటాను: అవికా గోర్



'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌లో ఆనంది పాత్రతో గుర్తింపు తెచ్చుకున్నారు నటి అవికా గోర్. ప్రముఖ స్టంట్ రియాలిటీ షో 'ఖత్రోన్ కే ఖిలాడి' ద్వారా ఆమె మళ్లీ బుల్లితెరపై సందడి చేయనున్నారు. ఈ షో 15వ సీజన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలు పంచుకున్నారు.

''ప్రస్తుతం నేను నా ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉన్న పాత్రలనే ఎంచుకుంటున్నాను. ఏదో ఒక పాత్ర అని ఒప్పుకోవట్లేను. 'ఖత్రోన్ కే ఖిలాడి' షో అంత సులభం కాదు. అది శారీరకంగా, మానసికంగా సవాల్‌తో కూడినది. గతంలో ఈ షో 9వ సీజన్‌లో నేను కంటెస్టెంట్‌గా పాల్గొన్నాను. అప్పుడు కొన్ని స్టంట్స్ చేయాలంటే భయమేసింది. వాటితో పోలిస్తే ఈ సారి స్టంట్స్ విషయంలో ఫర్వాలేదు. ప్రస్తుతం కొన్ని ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి. త్వరలో టీవీకి సంబంధించి కూడా ఓ ప్రాజెక్ట్ రాబోతోంది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తాను. ఓ పంజాబీ మ్యూజిక్ వీడియోలోనూ నటించాను. అది ఆగస్టు 7న విడుదల కానుంది'' అని అవికా పేర్కొన్నారు. ఇక, ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి హోస్ట్ చేస్తున్న 'ఖత్రోన్ కే ఖిలాడీ 15' ప్రస్తుతం జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

# 'ఎల్లమ్మ'లో పర్శిగా దేవిశ్రీ ప్రసాద్..




సంగీత దర్శకుడిగా చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు దేవిశ్రీ ప్రసాద్ . ఇప్పుడాయన వెండితెరపై అలరించబోతున్న సంగతి తెలిసిందే. 'బలగం' వేణు యెల్దండి దర్శకత్వంలో దేవిశ్రీ ప్రసాద్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎల్లమ్మ'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఆగస్టు 2న దేవి పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీలోని ఆయన లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. చేతిలో కిరీటం పట్టుకుని రెట్రోలుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రంలో దేవిశ్రీ ప్రసాద్ డప్పు కళాకారుడిగా కనిపించనున్నట్లు ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. అంతకుమించిన సరికొత్త కథాంశంతో వేణు దీనిని రూపొందిస్తున్నారు. వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అందుకే ఆ రూల్ బ్రేక్ చేశా: విజయ్ సేతుపతి





కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ పై ఆయన చూపించిన అభిమానానికి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రంలో ఎందుకు నటించాల్సి వచ్చిందో విజయ్ సేతుపతి తాజాగా వెల్లడించారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో 'జైలర్ 2'లో తన అతిథి పాత్ర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

''నేను ఇతర సినిమాల్లో అతిథి పాత్రలు చేయడం ఎప్పుడో మానేశాను. కేవలం సూపర్ స్టార్ రజనీకాంత్ సార్ కోసమే ఈ రూల్ బ్రేక్ చేశాను. ఆయనతో కలిసి పనిచేయాలనే ఉద్దేశంతోనే 'జైలర్ 2'కి ఓకే చెప్పా. ఒక పోస్టర్‌పై రజనీ సార్‌తో పాటు నా ఫోటో ఉంటే.. సహజంగానే అందరి దృష్టి ఆయనపైనే ఉంటుంది. నన్ను పెద్దగా ఎవరూ గమనించరు. కానీ, ఇతర చిత్రాల్లో అతిథి పాత్రలు చేసినప్పుడు పోస్టర్లపై మనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. అది హీరోగా నేను నటిస్తున్న ఇతర సినిమాలపై ప్రభావం చూపుతుంది. అందుకే క్యామియోలు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను'' అని ఆయన స్పష్టం చేశారు.

గతంలో రజనీ నటించిన 'పేట' చిత్రంలో సేతుపతి ప్రతినాయకుడిగా మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన కోసం తన సొంత నిబంధనను సైతం పక్కన పెట్టడం చూసి అభిమానులు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన బ్లాక్ బస్టర్ హిట్ 'జైలర్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అక్టోబర్ 15న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# తైపీ ఓపెన్ ఛాంపియన్‌గా తన్వి శర్మ సరికొత్త చరిత్ర: అత్యంత చిన్న వయస్కురాలిగా రికార్డు

**ఫైనల్లో ప్రపంచ దిగ్గజాన్ని చిత్తు చేసి తొలి సూపర్ 300 టైటిల్‌ను ముద్దాడిన 17 ఏళ్ల భారత షట్లర్**





భారత బ్యాడ్మింటన్ రంగంలో మరో వినూత్న అధ్యాయం ఆవిష్కృతమైంది. 17 ఏళ్ల భారత యువ షట్లర్ తన్వి శర్మ తైపీ ఓపెన్ 2026 విజేతగా నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. తైపీ ఓపెన్ చరిత్రలోనే ఈ టైటిల్‌ను గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కురాలైన క్రీడాకారిణిగా అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. 2008లో భారత దిగ్గజం సైనా నెహ్వాల్ గెలుచుకున్న ఈ ప్రతిష్టాత్మక ట్రోఫీని సుదీర్ఘ కాలం తర్వాత తన్వి శర్మ మళ్లీ భారతదేశానికి తీసుకువచ్చింది.

ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో తన్వి శర్మ వియత్నాంకు చెందిన స్టార్ క్రీడాకారిణి థుయ్ లిన్ న్గుయెన్‌ను 21-16, 21-16 తేడాతో వరుస గేమ్‌లలో చిత్తు చేసింది. 2026 ఏడాదిలో తన్వికి ఇది తొలి టైటిల్ కాగా, కెరీర్‌లో మొదటి సూపర్ 300 విజయం కావడం విశేషం. మ్యాచ్ ప్రారంభంలో 10-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన తన్వి, మధ్యలో ప్రత్యర్థి పుంజుకుని 10-8తో సమీపించినప్పటికీ, ఒత్తిడిని జయించి అద్భుతమైన స్ట్రోక్ ప్లేతో విజయాన్ని కైవసం చేసుకుంది. తన చిన్నతనంలో తల్లి వద్దనే తొలి పాఠాలు నేర్చుకున్న తన్వి, కోర్టులో చూపించిన మ్యాచ్ అవేర్‌నెస్ ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది.

ఈ చారిత్రాత్మక విజయంపై రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి. సింధు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ తన్విపై ప్రశంసల జల్లు కురిపించింది. "తన్విని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. ఒక ప్రత్యేకమైన క్రీడాకారిణిగా ఎదిగేందుకు కావాల్సిన అన్ని నైపుణ్యాలు, ధైర్యం తన్విలో ఉన్నాయని నేను చాలా ఏళ్లుగా చెబుతున్నాను. ఈ టైటిల్ ఆమె సుదీర్ఘ ప్రయాణానికి ఒక ఆరంభం మాత్రమే. భారత బ్యాడ్మింటన్ భవిష్యత్తు చాలా ఉజ్వలంగా ఉంది" అని సింధు కొనియాడింది. ఈ విజయం లభించడం పట్ల తన్వి శర్మ హర్షం వ్యక్తం చేస్తూ, మ్యాచ్ బై మ్యాచ్ ప్రణాళికతో ఆడటమే తనను ఛాంపియన్‌గా నిలిపిందని వ్యాఖ్యానించింది.

# గ్లాస్గో హోటల్‌లో భారత్ తప్పుడు మ్యాప్‌ను ఎత్తిచూపిన లవ్లినా బోర్గోహైన్

**క్షమాపణలు చెప్పిన యాజమాన్యం**



ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ బాక్సర్ లవ్లినా బోర్గోహైన్ సమయస్ఫూర్తి, దేశభక్తి సోషల్ మీడియాలో నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఉన్న 'మిస్టర్ సింగ్స్ ఇండియా' అనే భారతీయ రెస్టారెంట్‌లో ప్రదర్శించిన భారతదేశ పటంలో ఈశాన్య రాష్ట్రాల భాగాన్ని వదిలేయడంపై లోవ్లినా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల 75 కేజీల విభాగంలో రజత పతకం సాధించిన అనంతరం లోవ్లినా విజయోత్సవ డిన్నర్ కోసం తన బృందంతో కలిసి ఆ రెస్టారెంట్‌కు వెళ్ళింది. ఆ సమయంలో అక్కడ ఉపయోగించిన నాప్‌కిన్లు మరియు బయట ఏర్పాటు చేసిన బోర్డులపై ఉన్న భారత పటంలో ఈశాన్య భారతం కనిపించకపోవడాన్ని ఆమె గమనించింది. వెంటనే రెస్టారెంట్ యాజమాన్య దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తూ.. "దయచేసి దీన్ని తప్పుగా భావించకండి, కానీ ఇది నన్ను ఎంతో బాధించింది. ఈ మ్యాప్‌లో మా ఈశాన్య ప్రాంతం లేదు. ఈశాన్య రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఇది మా మనోభావాలను గాయపరుస్తుంది. భవిష్యత్తులో ఈ పొరపాటు జరగకుండా చూసుకోండి" అని అత్యంత సున్నితంగా, గౌరవప్రదంగా వివరించింది.

ఈ ఘటనపై బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అజయ్ సింగ్ స్పందిస్తూ.. ఎలాంటి గొడవ లేదా వివాదం జరగలేదని స్పష్టం చేశారు. నాప్‌కిన్‌పై జరిగిన పొరపాటును తాము ప్రింటింగ్ లోపంగా చూపించామని, హోటల్ యాజమాన్యం వెంటనే తమ తప్పును అంగీకరించి దానిని తక్షణమే సరిదిద్దుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు

# టీమిండియాకు బిగ్ షాక్: మోకాలి గాయంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు జస్ప్రీత్ బుమ్రా దూరం




శ్రీలంకతో త్వరలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయం కారణంగా ఈ పర్యటన మొత్తానికి దూరమయ్యాడు. శ్రీలంకతో సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో బుమ్రా పేరును చేర్చినప్పటికీ, అతని భాగస్వామ్యాన్ని ఫిట్‌నెస్‌కు లోబడి ఉంచారు. తాజాగా నిర్వహించిన అంచనాలో అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించలేకపోవడంతో ఈ కీలక సిరీస్ నుండి తప్పుకోవాల్సి వచ్చింది.

ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో బుమ్రా గాయపడ్డాడు. దీంతో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డే మ్యాచ్‌కూ దూరమయ్యాడు. అంతకుముందు బుమ్రా కోలుకుని ఫిట్‌నెస్ సాధించాడని కథనాలు వచ్చినప్పటికీ, పూర్తిస్థాయిలో కోలుకోకపోవడంతో బోర్డు వైద్య బృందం అతనికి విశ్రాంతి నివ్వడానికే మొగ్గుచూపింది. ఆగస్టు 15 నుండి గాల్ వేదికగా తొలి టెస్టు, ఆగస్టు 23 నుండి కొలంబోలో రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానున్నాయి.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకోవాలంటే భారత్‌కు ఈ సిరీస్ అత్యంత ప్రాధాన్యమైనది. ఫైనల్ రేసులో నిలవాలంటే రాబోయే 9 టెస్టుల్లో భారత్ కనీసం 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సి ఉంది. సొంతగడ్డపై శ్రీలంక సవాలు విసురుతున్న తరుణంలో, గిల్ సారథ్యంలోని భారత బౌలింగ్ దళానికి బుమ్రా లేకపోవడం పెద్ద లోటుగా మారనుంది.

# అరచేతిలో అశ్లీల సామ్రాజ్యం... బాల్యంలో భయాల రాజ్యం!

- కన్నవారే కాలాత్మకులుగా మారుతున్న వేళ...
- పిల్లల్లో పెరుగుతున్న కుటుంబ భయం... జీవితాంతం వెంటాడే మానసిక గాయాలు!
- మారుతున్న సాంకేతికత... మాయమవుతున్న బాంధవ్యాలు!
- సోషల్ మీడియా అశ్లీల కంటెంట్‌తో వికృత ఆలోచనలకు ఊతం?
- గుడ్ టచ్ చెప్పని కుటుంబాలు... బ్యాడ్ టచ్ బాధను మోస్తున్న చిన్నారులు!
- చట్టాలు కఠినమైనా... మారాల్సింది మనస్తత్వమే!
- ప్రముఖ ఫ్యామిలీ ఫిజీషియన్, సీనియర్ న్యాయవాది అడ్వకేట్ లక్ష్మి కట్ట









**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:**

ఒకప్పుడు పిల్లలను బయటివారి నుంచి కాపాడాలనే ఆందోళన ఎక్కువగా ఉండేది. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయి. ఇంట్లోనే సురక్షితం అనే భావన ప్రతి సందర్భంలో నిజం కాకపోవడం సమాజాన్ని కలవరపెడుతోంది. చిన్నారులపై లైంగిక దాడుల కేసుల్లో కుటుంబ సభ్యులు, బంధువులు లేదా పరిచయస్తుల ప్రమేయం వెలుగుచూస్తున్న ఘటనలు పెరుగుతుండటంతో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పిల్లల భద్రతపై కుటుంబాలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

పిల్లలపై లైంగిక వేధింపులు కేవలం ఒక నేరం మాత్రమే కాదు. అవి చిన్నారి బాల్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని, భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసే సామాజిక విషాదం. భయంతో, బెదిరింపులతో చాలా మంది చిన్నారులు తమపై జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పలేకపోతున్నారు. ఫలితంగా నేరాలు చాలా కాలం బయటపడకుండా కొనసాగుతున్న సందర్భాలు వెలుగుచూస్తున్నాయి.

## కన్నవారే కాలాత్మకులుగా మారుతున్నప్పుడు...

పిల్లలకు మొదటి రక్షణ కుటుంబమే. అయితే రక్షకులుగా ఉండాల్సిన కొందరే నిందితులుగా మారిన ఘటనలు సమాజాన్ని కుదిపేస్తున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు లేదా పరిచయస్తుల వల్ల ఎదురయ్యే ఇలాంటి అనుభవాలు పిల్లల్లో చెరగని మానసిక గాయాలను మిగులుస్తున్నాయి. ఒక్క సంఘటనతోనే వారి ప్రపంచం మారిపోతుంది.పిల్లలు ఒక్కసారిగా మౌనంగా మారడం, భయపడటం, ఒంటరిగా ఉండాలని కోరుకోవడం, చదువుపై ఆసక్తి తగ్గడం, నిద్రలో ఉలిక్కిపడటం, కొంతమంది వ్యక్తులను చూసి అసహజంగా స్పందించడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు.

## పిల్లల్లో పెరుగుతున్న కుటుంబ భయం

చిన్న వయసులో కుటుంబంలోనే భయానక అనుభవాలు ఎదురైతే, కుటుంబ వ్యవస్థపైనే అవిశ్వాసం పెరిగే ప్రమాదం ఉందని మానసిక ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పెద్దయ్యాక కూడా బంధాలను నమ్మలేకపోవడం, వివాహం పట్ల భయం, వ్యక్తిగత సంబంధాలపై అనుమానం, సమాజానికి దూరంగా ఉండే ధోరణి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఇది అధికారిక వైద్య నిర్ధారణ కాదు. అయినప్పటికీ కుటుంబంలో ఎదురైన తీవ్ర ప్రతికూల అనుభవాల కారణంగా కుటుంబ సంబంధాల పట్ల భయం లేదా తీవ్ర అవిశ్వాసం ఏర్పడే పరిస్థితిని కొందరు "కుటుంబ భయం"గా అభివర్ణిస్తున్నారు.

## మారుతున్న సాంకేతికత... మాయమవుతున్న బాంధవ్యాలు

స్మార్ట్‌ఫోన్ సమాచారం, విద్య, వినోదానికి ఎంతగానో ఉపయోగపడుతున్నా, నియంత్రణ లేకుండా వినియోగిస్తే ప్రతికూల ప్రభావాలు కూడా ఉంటాయి. పిల్లలు వయస్సుకు తగని కంటెంట్‌ను చూడకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.ఒకే ఇంట్లో ఉంటూ ఒకరితో ఒకరు మాట్లాడుకునే సమయం తగ్గిపోవడం, ప్రతి ఒక్కరూ తమ తమ మొబైల్‌లకే పరిమితం కావడం వల్ల పిల్లల భావోద్వేగ మార్పులను గుర్తించే అవకాశం కూడా తగ్గుతోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## సోషల్ మీడియా... పర్యవేక్షణే రక్షణ

సోషల్ మీడియా స్వతహాగా ప్రమాదకరం కాదు. కానీ పిల్లలు ఏమి చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఎంతసేపు ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి. డిజిటల్ భద్రత, వ్యక్తిగత గోప్యత, అపరిచితులతో సంభాషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలి.అదే సమయంలో గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి వయస్సుకు తగిన రీతిలో వివరించి, ఏదైనా అసౌకర్యం కలిగితే వెంటనే నమ్మకమైన పెద్దలకు చెప్పాలని పిల్లలకు నేర్పించాలి.

## చట్టాల కంటే చైతన్యమే ముఖ్యం

పోక్సో వంటి కఠిన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ నేరాలు పూర్తిగా ఆగలేదు. నేరం జరిగిన తర్వాత శిక్షించడం కంటే, నేరం జరగకుండా ముందే నివారించడం మరింత ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబంలో నమ్మకమైన వాతావరణం, పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడటం, వారి భావాలను వినడం, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు పిల్లల రక్షణకు బలమైన కవచంగా నిలుస్తాయి.

## న్యాయ నిపుణుల అభిప్రాయం

చిన్నారులపై లైంగిక నేరాల విషయంలో మౌనం పాటించడం సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తుందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అపఖ్యాతి భయంతో ఫిర్యాదు చేయకుండా ఉండటం బాధిత చిన్నారికే అన్యాయం చేస్తుందని పేర్కొంటున్నారు. పోక్సో చట్టం చిన్నారుల రక్షణ కోసం రూపొందించబడిందని, నేరస్తుడు ఎవరైనా చట్టం ముందు సమానమేనని గుర్తుచేస్తున్నారు.


నేరం జరిగినట్లు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడం, బాధిత చిన్నారికి వైద్య, మానసిక సహాయం అందించడం, వారి గోప్యతను కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత అని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

## ముగింపు

పిల్లలకు మనం ఇవ్వగలిగే గొప్ప బహుమతి ఖరీదైన మొబైల్ ఫోన్ కాదు... భద్రమైన బాల్యం. ప్రేమతో కూడిన సంభాషణ, అప్రమత్తమైన పర్యవేక్షణ, సరైన అవగాహన, నమ్మకమైన కుటుంబ వాతావరణం ఉంటేనే పిల్లలు ధైర్యంగా ఎదుగుతారు. ప్రతి చిన్నారి నవ్వు సురక్షితంగా ఉండే సమాజాన్ని నిర్మించడం ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి పౌరుడి బాధ్యత.



ప్రముఖ ఫ్యామిలీ ఫిజీషియన్, సీనియర్ న్యాయవాది అడ్వకేట్ లక్ష్మి కట్ట



# శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న అమెరికా కాన్సుల్ జనరల్ లారా

## ఈ. విలియమ్స్‌కు ఘన స్వాగతం పలికిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ప్రత్యేక ఆహ్వానం మేరకు విచ్చేసిన అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్ సంప్రదాయబద్ధంగా శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు వివరించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ రాష్ట్ర ప్రజల భక్తి విశ్వాసాలకు, సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల విశిష్టతను, బోనం సమర్పణ అనంతరం నిర్వహించే సంప్రదాయ రంగం కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను అమెరికా కాన్సుల్ జనరల్‌కు వివరించారు.తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేసే అవకాశంగా ఈ సందర్శన నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా తెలంగాణ- అమెరికా మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో వైభవంగా బోనాల వేడుకలు

## బోనాల విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు





హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 02:

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి అధికార నివాసంలో ఆదివారం సంప్రదాయబద్ధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఏర్పాటు చేసిన బోనాల విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బోనాల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు అతిథులను ఆప్యాయంగా ఆహ్వానించి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అతిథులతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ వారికి స్వయంగా ఆతిథ్యం



అందించారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మంత్రి పొన్నం ప్రభాకర్ గారి తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్ ,వారి సోదరులు వారి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ కుటుంబ సభ్యులను పలకరించారు. ఈ ఆత్మీయ వాతావరణం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలవడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఆత్మీయ సమావేశంగా నిలిచింది.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com